పెన్ పవర్
తెలంగాణ రౌండప్



బతుకమ్మ వేడుకలకు బయలు దేరిన చిన్నారి ఆరాధ్య..







# ఉయ్యాలో.. ఉయ్యాలో...
# సద్దుల బతుకమ్మ ఉయ్యాల..!

- తెలంగాణ అంతటా అంబరాన్నంటిన పూల పండుగ బతుకమ్మ సంబరాలు..
- ఆటపాటలతో హోరెత్తిన పల్లెలు, పట్టణాలు.. ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా బతుకమ్మ..
- తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు వెల్లివిరిసిన వైభవం..!

- పూల సోయగం.. ఆటపాటల వైభవం.. తెలంగాణలో సద్దుల బతుకమ్మ సంబరం..!
- ఉయ్యాలో.. ఉయ్యాల.. ఊరూరా బతుకమ్మల కోలాహలం..! పల్లె పల్లెనా పూల పండుగ..
- తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు..
- సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మంకాల కుటుంబీకుల బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..
- సూర్యాపేట జిల్లా కేంద్రం జనగామ క్రాస్‌రోడ్డులో మహిళలు, చిన్నారుల సందడితో ఘనంగా వేడుకలు..
- కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో సామూహిక బతుకమ్మ సంబరాలు..
- దుండిగల్ మండలం బౌరంపేట్‌లో బతుకమ్మ సందడి: ఇందిరమ్మ కాలనీలోనూ బతుకమ్మ పండుగ కోలాహలం..
- తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మల అలంకరణ..
- మహిళల ఐక్యతతో జానపద గీతాలు, సంప్రదాయ నృత్యాలతో సామాజిక అనుబంధాలు..
- తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక.. గ్రామీణ ఐక్యతకు బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలిచాయి..
- ప్రకృతి ఆరాధన, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతీ సంప్రదాయాల సందేశాన్ని చాటిచెప్పిన పూల పండుగ..

**హైదరాబాద్/మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 18:** ఉయ్యాలో.. ఉయ్యాలో.. సద్దుల బతుకమ్మ ఉయ్యాల.. అంటూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగలో తొమ్మిదో రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. తీరొక్క ప్రకృతి పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను చేతబూని మహిళలు, యువతులు, చిన్నారులు వేడుకల ప్రాంగణాలకు తరలివచ్చారు. బతుకమ్మల చుట్టూ వలయాకారంగా నిలబడి సంప్రదాయ జానపద గీతాలు ఆలపిస్తూ, చప్పట్లతో లయబద్ధంగా అడుగులు కలుపుతూ చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎటుచూసినా రంగురంగుల పూల సోయగాలు, మహిళల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో పండుగ శోభను సంతరించుకున్నాయి.

-4లో



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో బతుకమ్మ సంబరాలు..



కామారెడ్డి జిల్లాలో, బతుకమ్మల చుట్టూ మహిళలు పాటలతో నృత్యాలు..

# ఉయ్యాలో.. ఉయ్యాలో.. సద్దుల బతుకమ్మ ఉయ్యాల..!



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ సంబరాలు..



హైదరాబాద్ కుత్బుల్లాపూర్ జీడిమెట్ల డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు..



సూర్యాపేట జిల్లా కేంద్రం జనగామా క్రాస్ రోడ్డు వద్ద బతుకమ్మ వేడుకలకు బయలుదేరిన మహిళలు..



ఖమ్మం జిల్లా కాకరవాయిలో బతుకమ్మ సంబరాలు..

## బౌరంపేట్‌లో.. ఇందిరమ్మ కాలనీలో బతుకమ్మ సందడి..

హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోనూ సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.. బౌరంపేట్-ఇందిరమ్మ కాలనీలోని పలు బస్తీలకు చెందిన మహిళలు, యువతులు, చిన్నారులు అందంగా అలంకరించిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ జానపద గీతాలు ఆలపిస్తూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చేసిన ఆటపాటలు పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. నగర జీవనంలోనూ తెలంగాణ సంప్రదాయాలను సజీవంగా కొనసాగిస్తూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం..

## కామారెడ్డి జిల్లా బస్వాపూర్‌లో గ్రామంలో..

కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువతులు, చిన్నారులు ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకలకు తండోపతండాలుగా తరలివచ్చారు. బతుకమ్మలను ఒకచోట ఉంచి వాటి చుట్టూ చేరిన మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. గ్రామీణ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ సంబరాలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.. బతుకమ్మ వేడుకలతో గ్రామంలోని ప్రధాన వీధులు, పండుగ ప్రాంగణాలు కళకళలాడాయి. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా గ్రామీణ ఐక్యత, పరస్పర ఆత్మీయతకు ఈ వేడుకలు వేదికగా నిలిచాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసికట్టుగా పండుగలో పాల్గొంటూ ఆనందాన్ని పంచుకున్నారు..

-3 పేజి తరువాయి

తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ సద్దుల బతుకమ్మ వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా సాగాయి. గ్రామాలు, పట్టణాల్లో మహిళలు తమ ఇళ్ల వద్ద బతుకమ్మలను అందంగా పేర్చి సామూహిక వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ జానపద గీతాలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో పండుగ ప్రాంగణాలు కళకళలాడాయి. బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి, సంప్రదాయ ఆచారాల నడుమ గౌరమ్మకు పూజలు నిర్వహించారు.. పూల పండుగ వేడుకలు తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని, మహిళల ఐక్యతను మరోసారి చాటిచెప్పాయి..

**కొమురవెల్లిలో ప్రత్యేక ఆకర్షణగా, హంస వాహనంపై బతుకమ్మ..**

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న స్వామి కొలువుదీరిన కొమురవెల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.. గ్రామానికి చెందిన మంకాల కుటుంబీకులు తయారు చేసిన బతుకమ్మ అందరినీ ఆకట్టుకుంది.. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల పూలను అందంగా పేర్చి రూపొందించిన బతుకమ్మ పూల పండుగ వైభవాన్ని చాటిచెప్పింది.. "హంస వాహనంపై కొలువుదీరిన బతుకమ్మను, గౌరమ్మను ఒకేచోట ఏర్పాటు చేసి ప్రత్యేకతను చాటుకున్నారు.. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. భక్తి, సంప్రదాయం, కుటుంబ అనుబంధాల సమ్మేళనంగా సాగిన వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి..



## తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ..!

తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బతుకమ్మ రాష్ట్ర అస్తిత్వానికి, సంస్కృతీ సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. తెలంగాణ ప్రజల జీవన విధానం, ప్రకృతి పట్ల గౌరవం, మహిళల సామూహిక భాగస్వామ్యం, జానపద కళల ప్రాధాన్యతను ఈ పండుగ ప్రపంచానికి చాటిచెబుతోంది. పూలతో పేర్చిన బతుకమ్మల అందం, సంప్రదాయ గీతాల మాధుర్యం, మహిళల ఉత్సాహభరిత నృత్యాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయి.. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవనశైలిలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ, బతుకమ్మ వంటి సంప్రదాయ పండుగలు తెలంగాణ ప్రజలను తమ మూలాలతో అనుసంధానిస్తున్నాయి. పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఆచారాలను కొనసాగిస్తూ, వాటి ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.. మొత్తానికి ఉయ్యాలో.. ఉయ్యాలో.. అంటూ తెలంగాణ అంతటా మారుమోగిన బతుకమ్మ పాటలు, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో సద్దుల బతుకమ్మ వేడుకలు పండుగ శోభను అంబరాన్నంటించాయి. ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ, మహిళల ఐక్యతను చాటిచెప్పిన ఈ పూల పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా మరోసారి నిలిచింది.

## మహిళల ఐక్యతకు.. సామాజిక అనుబంధాలకు వేదిక..

బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు, సామూహిక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మహిళలు ఒకచోట చేరి బతుకమ్మలను పేర్చడం, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడడం, లయబద్ధంగా నృత్యాలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయ పద్ధతులు ఈ వేడుకల ద్వారా భావితరాలకు పరిచయమవుతున్నాయి.. గ్రామాల్లోని ప్రధాన వీధులు, దేవాలయాల పరిసరాలు, గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, పట్టణాల్లోని కాలనీలు బతుకమ్మ సంబరాలకు వేదికలుగా మారాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు కలిసి పాల్గొనడం ద్వారా పరస్పర అనుబంధాలు మరింత బలపడుతున్నాయి. మహిళలు, యువతులు, చిన్నారుల భాగస్వామ్యంతో బతుకమ్మ పండుగ సామాజిక ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక వేడుకగా నిలుస్తోంది.

## సూర్యాపేటలో సద్దుల బతుకమ్మ సంబరాలు..

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్డు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల ను ఘనంగా నిర్వహించారు.. మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో పేర్చిన భారీ బతుకమ్మలను తీసుకువచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకల్లో పండుగ ఉత్సాహం వెల్లివిరిసింది.. చిన్నారులు, మహిళలు, సైతం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకున్నారు..



## ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగ..!

బతుకమ్మ కేవలం ఆటపాటల పండుగ మాత్రమే కాదు.. ప్రకృతిని ఆరాధిస్తూ, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే విశిష్టమైన పండుగ. వర్షాకాలం ముగిసి ప్రకృతి పచ్చదనంతో కళకళలాడే సమయంలో సహజంగా లభించే వివిధ రకాల పూలను సేకరించి, వాటిని వరుసలుగా పేర్చి బతుకమ్మగా అలంకరించడం ఈ పండుగలో ప్రధాన ప్రత్యేకత.. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో రూపొందించే బతుకమ్మలు ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తాయి. పూలను పూజించడం, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆడడం, పండుగ ముగింపులో సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న విడదీయలేని అనుబంధాన్ని బతుకమ్మ చాటిచెబుతుంది. ప్రకృతిలోని జీవవైవిధ్యాన్ని గౌరవిస్తూ, పర్యావరణంతో మమేకమై జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది..



బస్వాపూర్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు..



కొమురవెల్లిలో బతుకమ్మ వేడుకలు..



బౌరంపేట్ గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా బతుకమ్మ..



దుండిగల్ మండలం బౌరంపేట్‌లో బతుకమ్మను తలపై ఎత్తుకుని బయలుదేరిన మహిళలు..







292 డివిజన్‌లో ప్రత్యేక ఆకర్షణగా అలంకరించిన బతుకమ్మ..



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేస్తున్న వినోద్..

# బతుకమ్మ సంబరాల్లో.. ముఖ్య అతిథిగా వారాల వినోద్..

- 292 డివిజన్ సాయిబాబా నగర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు..!
- మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు వారాల వినోద్ కుమార్‌తో నాయకులు స్టెప్పులు..
- ఆటపాటలతో వేడుకల్లో పాల్గొని ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన వినోద్..
- బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేసిన వినోద్ కుమార్..
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, పిల్లలు, కాలనీవాసులు..

## -ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపి.. వారితో కలిసి స్టెప్పులేసిన నాయకులు..!

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 18:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ సిఎంసి పరిధిలోని 292 సాయిబాబా నగర్ డివిజన్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడపడుచులు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేయగా.. వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ వారితో కలిసి స్టెప్పులు వేస్తూ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ పండుగ సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 292 సాయిబాబా నగర్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి.. సాయిబాబా నగర్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, కాలనీవాసులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరిన మహిళలతో కలిసి ఆయన పాటలకు స్టెప్పులు వేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, మహిళల ఆటపాటలతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలతో మమేకమై వేడుకల్లో పాల్గొనడంతో సంబరాలు మరింత సందడిగా సాగాయి.



బీఆర్ఎస్ నేత వారాల వినోద్ బతుకమ్మ పాటలకు స్టెప్పులు..



### మహిళలకు శుభాకాంక్షలు.. ప్రత్యేక బహుమతులు..

బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులందరికీ వారాల వినోద్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మలతో వేడుకలకు హాజరైన మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేసి అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందనే భావనను ఆయన వ్యక్తం చేశారు..



సాయిబాబా నగర్‌లో బతుకమ్మ సంబరాలు..

### పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాలనీవాసులు..

ఈ వేడుకల్లో మహిళలు, పిల్లలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూల బతుకమ్మల అందాలు, సంప్రదాయ గీతాలు, మహిళల నృత్యాలతో సాయిబాబా నగర్ పరిధిలోని కాలనీలు పండుగ శోభను సంతరించుకున్నాయి. స్థానికంగా నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్, కృషి కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, జై శ్రీరామ్ నగర్ ప్రెసిడెంట్ వేణు ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అనిల్, బైరిష్ గౌడ్, మాజీ పాషా, మహేష్ గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు..



ముస్లిం పెద్దలు వారాల వినోద్‌ను సత్కరిస్తున్న దృశ్యం..

## సర్వమత ప్రార్థనలతో ఆశీర్వచనాలు..

అనంతరం నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో వివిధ మతాలకు చెందిన పెద్దలు పాల్గొని వారాల వినోద్ కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజంలో మతసామరస్యం, సోదరభావం, ఐకమత్యంతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమాల్లో డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొని వారాల వినోద్ కుమార్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు



వారాల వినోద్ కుమార్. బీఆర్ఎస్ నేత..

# పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి.. చీరలు పంపిణీ..!

- బీఆర్ఎస్ నాయకుడు ఉద్యమ నేత వారాల వినోద్ కుమార్ జన్మదినం సందర్భంగా..
- జన్మదినం సందర్భంగా సర్వమత ప్రార్థనలు.. ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 18:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత వారాల వినోద్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించగా.. ఆదివారం ఉదయం 292వ డివిజన్ సాయిబాబా నగర్ పరిధిలో నిత్యం బస్తీల్లో పారిశుద్ధ్య సేవలందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వినోద్ కుమార్ సత్కరించి, వారికి చీరలు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. బస్తీల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే కార్మికులను గౌరవించడం, వారి సేవలకు గుర్తింపునివ్వడం ఎంతో అవసరమనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు..ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ, వారాల వినోద్ కుమార్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలకు అనుగుణంగా స్పందిస్తారని, కష్టసుఖాల్లో అండగా నిలుస్తారని సంతోషం వ్యక్తం చేశారు..



వారాల వినోద్ కుమార్ జన్మదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ..

## కారు ఢీ కొని అన్నాచెల్లెళ్ల మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:** స్కూటీపై వెళ్తున్న అన్నాచెల్లెళ్లను కారు ఢీ కొనడంతో వారిద్దరూ మృత్యువాత పడ్డారు. మరో చిన్నారికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారులోని పెద్ద అంబర్‌పేట వద్ద చోటు చేసుకుంది. పెద్ద అంబర్‌పేటకు చెందిన నవీన్.. శంషాబాద్‌లో ఉంటున్న తన చెల్లి రేఖను దసరా పండగ కోసం ఇంటికి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కోదాడలో విషాదం.. తల్లి దాడిలో చిన్నారి మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో విషాదం చోటు చేసుకుంది. తొమ్మిదేళ్ల బాలిక జాస్మిన్‌పై కన్నతల్లే దాడి చేసి చంపేసింది. శనివారం సాయంత్రం ఆడుకుంటున్న జాస్మిన్‌పై తల్లి సైరాబాను రాయితో దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. సైరాబాను గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే భర్త కూడా దూరంగా ఉంటున్నాడు. చిన్నారితో కలిసి కోదాడలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. చిన్నారి మృతితో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలి మేనమామ ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పూల పండుగలో మహిళల కోలాహలం..

## ఘనంగా ముగిసిన సంతూర్ పసుపు చందనాల బతుకమ్మ వేడుకలు





**ఖమ్మం రాధాకృష్ణ నగర్‌లో..**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఈనాడు -- ఈఎఫ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సంతూర్ పసుపు చందనాల బతుకమ్మ వేడుకలు మహిళల విశేష స్పందనతో విజయవంతంగా ముగిశాయి. ఖమ్మంలోని రాధాకృష్ణ నగర్, వరంగల్‌లోని వడ్డేపల్లి చెరువు, సూర్యాపేటలోని సద్దల చెరువు, నిజామాబాద్‌లోని రఘునాథ్ చెరువు - ఖిల్లా రామాలయం, కరీంనగర్‌లోని డ్యామ్ కట్టరాంపూర్ సీఎం పాయింట్, హైదరాబాద్‌లోని రామ్‌నగర్ గుండు, ముషీరాబాద్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.

**వరంగల్‌లో..**

మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో భారీ మెగా బతుకమ్మను అందంగా పేర్చి, దాని చుట్టూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు ఆటపాటలు, కోలాటాలతో పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళల ఉత్సాహం, బతుకమ్మ పాటలతో కార్యక్రమ ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

**సూర్యాపేటలో..**

ఈఎఫ్ఎం ఆర్జేలు మహిళలతో మమేకమై సరదా సంభాషణలు నిర్వహిస్తూ, వినోదాత్మక ఆటలు, పోటీలతో సందడి చేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు సంతూర్ గిఫ్ట్ హ్యాంపర్లను అందజేశారు. మహిళల భారీ భాగస్వామ్యం, సంప్రదాయ ఆటపాటలు, ఆర్జేల సందడితో ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## తెలంగాణ వర్సిటీల్లో కొలువుల పండుగ.. 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడు ప్రముఖ విశ్వవిద్యాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అధికారికంగా ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నియామకాల ద్వారా ఉస్మానియా, తెలంగాణ, తెలుగు, శాతవాహన, పాలమూరు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాలతో పాటు మరొక యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సంబంధిత యూనివర్సిటీలు త్వరలోనే అధికారిక నోటిఫికేషన్లు విడుదల చేయనున్నాయి. అకడమిక్ మెరిట్, రీసెర్చ్ పబ్లికేషన్స్, ఇంటర్వ్యూలలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగనుంది. సుదీర్ఘకాలంగా ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఊరటనిచ్చింది.

## పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలి : మంత్రి పొన్నం



**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ వేడుకల్లో పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. పూల పండుగ సందర్భంగా మహిళలతో మమేకమై సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గౌరమ్మను ప్రార్థించాలని కోరారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో వ్యవసాయానికి అవసరమైన వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రార్థించే మహిళలు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ బాగుండాలని కోరుకోవాలని అన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు ఐకమత్యంతో ఈ పండుగను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణకే సొంతం..: హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్ నినో ప్రభావం తో రాష్ట్ర మొత్తం నీళ్ల కరువుతో అల్లాడిపోతుంటే సిద్దిపేట కోమటి చెరువు గోదావరి జలాలతో మత్తడి దూకుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో హరీష్ రావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కోమటి చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో కలియతిరిగి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కావడంతోనే సిద్దిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు వచ్చాయన్నారు. ఒకప్పుడు మురికి నీళ్లతో ఉండే చెరువు నేడు స్వచ్ఛమైన గోదావరి జలాలతో నిండుగా ఉందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ కే సొంతమన్నారు. తెలంగాణ బిడ్డలు మన సంస్కృతి, సంప్రదాయాలతో ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డగా ఈ బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. సిద్దిపేట కోమటి చెరువు ను అన్ని విధాలా అభివృద్ధి చేయడంతోనే ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య ఈ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న రన్నారు.

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్ పెన్ పవర్:** నిజామాబాద్ ఖిల్లాపై ఉన్న చారిత్రక రామాలయానికి రోప్‌వే నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. సుమారు రూ.35 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఖిల్లా రామాలయానికి చారిత్రక ప్రాధాన్యం ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందుకోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు. ఇటీవల రోడ్లు, భవనాల శాఖ అధికారులు, రోప్‌వే సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావడం సంతోషకరమన్నారు.

**నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

అర్బన్ నియోజకవర్గంలో గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని, సొంత స్థలం లేని నిరుపేదలకు బహుళ అంతస్తుల భవనాల ద్వారా ఇళ్లు అందించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. బీజేపీ గెలుపును సహించలేక నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పూల వైభవం.. బతుకమ్మ సంబురం.. సంగారెడ్డిలో కనువిందు చేసిన మహా బతుకమ్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి అర్బన్: రంగురంగుల పూల అందాలు.. బతుకమ్మ పాటలు మహిళల ఆటపాటల కోలాహలం.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవం నడుమ సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ పెద్ద చెరువు కట్టపై బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేల కిలోల పూలతో రూపొందించిన భారీ బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూల పరిమళాలు, విద్యుత్ దీపాల కాంతులు, మహిళల ఆనందోత్సాహాలతో చెరువు కట్ట పండుగ శోభను సంతరించుకుంది. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పండుగ కొరకు భారీ ఏర్పాట్లు చేశారు.

**భారీ బతుకమ్మ.. ప్రత్యేక ఆకర్షణ**

కింది బజార్ పెద్ద చెరువు కట్టపై ఎనిమిది టన్నుల పూలతో 32 అడుగుల మహా బతుకమ్మ.. 16 టన్నుల ఉక్కు నిర్మాణం తో అద్భుత రూపకల్పన పూలతో రూపొందించిన భారీ బతుకమ్మ అందరినీ ఆకట్టుకుంది. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచింది. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూలతో పేర్చిన బతుకమ్మల అందాలు, మహిళల సందడి పండుగకు మరింత వన్నె తెచ్చాయి.

**ఆరు వేదికలు.. ఆటపాటలతో సందడి**

మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆరు ప్రత్యేక వేదికలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా వేదికల వద్ద కళాకారుల ఆటపాటలు, జానపద గీతాలు ప్రజలను అలరించాయి. ప్రత్యేక ట్రస్ లైటింగ్, విద్యుత్ దీపాల అలంకరణలతో చెరువు కట్ట పరిసరాలు కాంతులీనాయి. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు బతుకమ్మలతో పాల్గొని పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

**వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల**

బతుకమ్మ సంబురాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ పండుగ ఏర్పాట్లను చేశారు కింది బజార్ పెద్ద చెరువు కట్టపై జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.వేల కిలోల పూలతో రూపొందించిన భారీ బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మల జగ్గారెడ్డి తన కుమార్తెతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.జగ్గారెడ్డి కూడా వేడుకల్లో పాల్గొని మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.మహిళలతో కలిసి నిర్మల జగ్గారెడ్డి ఆటపాటల్లో పాల్గొని పండుగ సంబురాలను ఆస్వాదించారు.చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఆరు ప్రత్యేక వేదికలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. కళాకారుల ఆటపాటలు, జానపద గీతాలు అందరినీ అలరించాయి.ప్రత్యేక ట్రస్ లైటింగ్, విద్యుత్ దీపాల అలంకరణలతో ప్రాంగణం కాంతులీనింది.పూల పరిమళాలు, మహిళల సందడితో కింది బజార్ చెరువు కట్ట పండుగ కళను సంతరించుకుంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి.బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.జగ్గారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్, కిరణ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్ కుమార్ దీపక్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వైద్యులను ఆదేశించారు.ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం హఠాత్తుగా ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్ నేరుగా వార్డుల్లోకి వెళ్లి రోగుల పరిస్థితిని పరిశీలించారు. ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, భోజన సౌకర్యం, పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, నర్సులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

ఆసుపత్రి ఆవరణ, మరుగుదొడ్లు, వార్డుల పరిశుభ్రతను పరిశీలించి పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని, రోగుల నుండి బయట మందులు కొనిపించుకోరాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండుగలు, సెలవు రోజుల్లో సైతం రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ వైద్యులు తప్పనిసరిగా విధుల్లో అందుబాటులో ఉండాలని, హాజరు రిజిస్టర్ ను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర సేవల కోసం ఎమర్జెన్సీ వార్డును 24 గంటలూ తెరిచి ఉంచాలని, కనీసం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పులివెందుల స్థానిక పోరు.. జగన్‌కు బిగ్ టెస్టే..!



వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ భారీ ట్విస్టులతో ముడిపడిందనే చెప్పాలి. వైసీపీ తరఫున ఇప్పటికే మహిళ నాయకురాలు, జగన్ బంధువు టికెట్ సంపాదించుకున్నారు. నామినేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక, టీడీపీ కూడా ఈ సీటును మహిళకు ఎంపిక చేశారు. దీంతో వైసిపి- టిడిపి మహిళా నాయకురాళ్ల మధ్య తీవ్రస్థాయిలో పోటీ అయితే ఉండనంది. ఇందులో ప్రధానంగా గమనించాల్సింది పులివెందుల మున్సిపాలిటీని దక్కించుకోవడం జగన్ కి ఇప్పుడు అత్యంత కీలకం. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పరిస్థితి దారుణంగా ఉన్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంలో మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకోకపోతే అది మరింత ఇబ్బందికర పరిణామాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల పరిస్థితులను చూసుకుంటే ఇరుపక్షాల మధ్య కూడా దాడులు జరిగాయి. అలాగే మాటల తూటాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు కూడా ఇరు పక్షాల మధ్య కామన్ గా మారిపోయింది. మహిళా నాయకులు పోటీలో ఉన్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందా.. లేకపోతే సర్దుబాటు అవుతాయా అనేది చూడాలి.

కానీ అటు వైసిపి ఈ ప్రాంతాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహంతో ముందుకు సాగుతూ ఉండడం గమనార్హం. అలాగే టిడిపి కూడా జగన్ నియోజకవర్గంలో తాము పాగా వేయాలని నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహాన్ని టిడిపి వైసిపిలు అనుసరిస్తున్నాయి. వైసీపీ తరఫున బరిలోకి దిగిన జగన్ చిన్నమ్మ వైయస్ ప్రమీల టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన తుగుట్ల గీతా కుమారి ఇద్దరు సీనియర్ నాయకులు కావడం గమనార్హం.

అంతేకాదు.. ఇరువురికి స్థానికంగా బలమైన ఫాలోయింగ్ ఉండడం వంటివి కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం టిడిపికి స్థానికంగా మద్దతు ఎక్కువ కనిపిస్తోంది. బీటెక్ రవి వ్యూహాలు అదేవిధంగా టిడిపి అధిష్టానం అనుసరిస్తున్న పద్ధతులు వంటివి ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపించే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రమీలమ్మ రంగంలోకి దిగడంతో వైఎస్ ఫ్యామిలీ ప్రభావం కూడా ఉంటుందన్నది పరిశీలకులు అంటున్నారు. మరి ఏం జరుగుతుందని చూడాలి. ఏది ఏమైనా జగన్‌కు ఇది అత్యంత సవాలుగా మారనుందన్నది ఖాయం.

# ఏపీ లోకల్ వార్ ఇంకా ట్విస్టులు ఉన్నాయ్.. వీళ్లకు బిగ్ టెస్ట్... !



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన శుక్రవారం నాడు రాయలసీమ జిల్లాల్లోని రాజంపేట పార్లమెంటు పరిధిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లో టిడిపి వైసిపి వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలు తారా స్థాయికి చేరాయి. కనీసం నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదన్న వాదన బలంగా వినిపించేలా చేసింది. దీనిపై పోలీసులు సీరియస్ గా స్పందించారు. తాజాగా 70 మందిపై కేసులు పెట్టారు. ఇంకా వందల మంది ఈ దాడుల్లో పాల్గొన్నారని భావిస్తూ.. వారి వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ ఘర్షణలు ఇక్కడితో ఆగిపోయినట్టేనా ఇక అంతా ప్రశాంతంగా జరుగుతుందా అంటే దీనికి సమాధానం లేదు. ఎందుకంటే ఇంకా బలమైన, వివాదాస్పదమైన నియోజకవర్గాలు చాలా ఉన్నాయి. వాటిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. నువ్వా నేనా అన్నట్టుగా ఉన్న ఆయా నియోజకవర్గాల్లో మరిన్ని ట్విస్టులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటిలో ప్రధానంగా తాడిపత్రి, ఆళ్లగడ్డ, కర్నూలు, ఒంగోలు, చీరాల, బాపట్ల ఇట్లా అనేకమైన సమస్యాత్మక ప్రాంతాలు కనిపిస్తున్నాయి.

వీటిలో కూడా టిడిపి- వైసిపిల మధ్య చిరకాల ఘర్షణలు చోటు చేసుకుంటాయన్న అంచనాలు ఉన్నాయి. అలాగే మాచర్ల, గురజాల వంటి పల్నాడు ప్రాంతాల్లో సీట్లు కూడా హాట్ హాట్ గా ఉన్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని వైసిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయటం ఆంక్షలు విధించడం వంటివి ఉన్నప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందని చెప్పడం కష్టంగా మారుతోంది. మరోవైపు టిడిపి నాయకులు కూడా ఏం జరిగినా ఫర్వాలేదు.. అనే రీతిలో నామినేషన్ కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రధానంగా దీర్ఘకాలంగా ఉన్న విభేదాలు, రాజకీయంగా జరుగుతున్న పరిణామాలు వంటిపై కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఒకప్పుడు పరిమితమైన

సమస్యలు ఇప్పుడు దాదాపు సగానికి పైగా నియోజకవర్గాలకు పాకడం ఆయా ప్రాంతాల్లో తీవ్రస్థాయి ఘర్షణలు చోటు చేసుకోవడం వంటివి చర్చనీయాంశంగా ఉన్నాయి. ఇరుపక్షాల్లోనూ పట్టుదల, ఆగ్రహం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించాలన్న ధోరణే కనిపిస్తోంది తప్ప ఎన్నికలను ప్రశాంతంగా ముందుకు తీసుకు వెళ్లాలన్న ఆలోచన కొరవడింది అన్నది వాస్తవం.

దీనిని పరిష్కరించేందుకు ఇరుపక్షాలు సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ముఖ్యంగా పులివెందుల, కుప్పం వంటి నియోజకవర్గాల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే భావిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియను సవాల్‌గా తీసుకుంటున్నారు. మరి ఏం జరుగుతుందనేది చూడాలి. ప్రస్తుతం అయితే సమస్యాత్మక ప్రాంతాలు పెరుగుతున్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఏ మేరకు ఫలిస్తాయి అన్నది ఆందోళన గానే ఉంది.

# నామినేషన్ల చివరి రోజు ట్విస్టు.. మూడు చోట్ల వైసీపీకి షాక్



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఆ తర్వాత సమయం మించిపోయిందని పలుచోట్ల అభ్యర్థులను వెనక్కి పంపారు. రాష్ట్రంలో మొత్తం వంద పట్టణ సంస్థలకు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. అయితే రాయలసీమతోపాటు ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులతో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగింది. మిగిలిన ప్రాంతంలో సజావుగా ముగిసింది. అధికార, విపక్షాల మధ్య ఘర్షణలతో రాయచోటి, దర్శి, పిడుగురాళ్లలో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని చెబుతున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో తొలి ఘట్టం ముగిసింది. ఈ నెల 14న షెడ్యూల్ విడుదల కాగా, 16వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించారు. సోమవారం నామినేషన్లను పరిశీలిస్తారు. 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారు. 26వ తేదీవరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు గడువు ఉంది. 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల అవుతాయి. మూడు రోజులుగా వంద పట్టణ సంస్థల్లో నామినేషన్లు స్వీకరించగా, రాయలసీమలోని ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తొలిరోజు పుంగనూరులో మొదలైన గొడవ పులివెందులలో పతాకస్థాయికి చేరింది. చివరికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సైతం జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఈ పరిణామాల మధ్యే ఆదివారం పలుచోట్ల ఘర్షణలు జరుగుతుండగానే వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ప్రయత్నించినట్లుగా చెబుతున్నారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలలోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికే అధికారులు అనుమతిచ్చినట్లుగా చెబుతున్నారు. దీంతో రాయచోటిలో వైసీపీ చైర్మన్ అభ్యర్థితోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయలేకపోయారని అంటున్నారు. రాయచోటిలో మూడు రోజులుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. 16వ తేదీన వైసీపీ కార్యాలయంలో వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అప్పుడు మొదలైన ఉద్రిక్తతలు మూడు రోజు వరకు కొనసాగాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ కేంద్రానికి సమయం లోగా వెళ్లలేకపోయారని అంటున్నారు. ఇక దర్శిలోనూ ఇదే పరిస్థితి నెలకుందని చెబుతున్నారు. దర్శిలో నామినేషన్ వేయలేక 25 మంది అభ్యర్థులు వెనుదిరిగారు. పిడుగురాళ్లలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఎన్నికల అధికారులు అనుమతించలేదు. ఈ పరిణామాలతో మూడు చోట్ల వైసీపీ పోటీ లేకుండానే మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిస్థితి ఉందని అంటున్నారు. అయితే అక్కడ ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులకు వైసీపీ మద్దతు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ కూటమికి వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారితో ఉపసంహరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తొలి ఘట్టం ముగియడంతో నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో రాజకీయం ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

# నెల్లూరులో రూప్‌కుమార్‌కు లక్కు చిక్కేనా.. ?



నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఊహించని విధంగా టిడిపి అధినేత చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల తర్వాత టిడిపిలోకి వచ్చిన రూపు కుమార్ కు మేయర్ స్థానం అప్పగించారు. నిజానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వంటి బలమైన నాయకులు చేసిన లాబీయింగ్ కూడా పక్కనపెట్టి చంద్రబాబు రూప్ కుమార్ కు అవకాశం కల్పించారు. ఇది ఒక రకంగా ఆయనకు లక్ అనే చెప్పాలి. అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. అంతర్గతంగా రూప్ కుమార్ చుట్టూ విభేదాలు ముసురుతున్నాయి. టీడీపీ కీలక నాయకులు ఆయన ఎంపికను తీవ్రంగా విభేదిస్తున్నారు. స్థానికంగా తీవ్ర ఆరోపణలు ఉన్న రూప్ కుమార్ కు టికెట్ ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు గుస్సాగా ఉన్నారు. ముఖ్యంగా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సైతం రూప్ కుమార్ ఎంపికపై మౌనంగా ఉండిపోయారు. పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం కావడంతో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఇష్టం లేక వారు సైలెంట్ అయిపోయారు. కానీ, అంతర్గతంగా మాత్రం రూప్ కుమార్ ఎలా గెలుస్తాడో చూస్తామని ఒకరిద్దరు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్నంత ఈజీగా రూప్ కుమార్‌కు గెలుపు సాధ్యం అవుతుందా అనేది ప్రశ్న. ముఖ్యంగా వైసిపి హయంలో రూపు కుమార్ వ్యవహరించిన తీరు, ఆయినపై వచ్చిన ఆరోపణలు వంటివి ఇప్పటికీ లైవ్ లోనే ఉన్నాయి. వాటిపై గతంలో టిడిపి సీనియర్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాంటిది ఇప్పుడు రూప్ కుమార్ కి అవకాశం ఇవ్వడం పై వారంతా ఆగ్రహంతో ఉన్నారు. అయితే పైకి మాత్రం ఎవరూ మాట్లాడటం లేదు. ఇది ఎన్నికల ప్రచారంపైన, అదేవిధంగా గెలుపు పైన కూడా ప్రభావం చూపించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా టిడిపి క్యాడర్లో రూప్ కుమార్ పై పెద్దగా పాజిటివ్ చర్చ అయితే నడవడం లేదు. ఆయనను ఇప్పటికీ వైసీపీ నుంచి వచ్చిన నాయకుడిగానే చూస్తున్నారు. గతంలో స్థానికంగా పదవులు నిర్వహించి ఉన్నప్పటికీ బలమైన కేడర్‌ను ఆయన సంపాదించుకోలేకపోయారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు స్వయానా బంధువు కావడం, ఆయన అనుచరులే ఈయనకి కూడా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కూటమి పార్టీలను ఐక్యంగా చేయటం వారిని తనవైపు తిప్పుకోవటం అనేది రూప్ కుమార్ కు అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారింది. నామినేషన్ వేయడం తేలికే కావచ్చు. కానీ, తీవ్రమైన పోటీలో గెలుపు గుర్రం ఎక్కడం అత్యంత ప్రధానమైన అంశం. దీనికి అన్ని వర్గాలు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం ఆయన పరిస్థితిని గమనిస్తే మంత్రి నారాయణ సహా సీనియర్ నాయకులు అందరూ సైలెంట్ అయిపోవడం రూప్ కుమార్ పట్ల పెద్దగా సానుకూల ధోరణి వ్యక్తం చేయకపోవడం వంటివి పెద్ద సమస్యగా మారుతున్నాయి. దీంతో రూప్ కుమార్ ఏ మేరకు విజయం దక్కించుకుంటారనేది చూడాలి.

# మళ్లీ రంగంలోకి బాబు.. సమస్యలు సెట్‌రైట్.. !



టిడిపి అధినేత చంద్రబాబు మళ్ళీ రంగంలోకి దిగుతున్నారా? పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆయన వరుస పెట్టి సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారా? అవసరమైతే జిల్లాల్లోనూ పర్యటించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా కూటమి పొత్తులో భాగంగా 20 స్థానాలకు పైగా మున్సిపల్ సీట్లను జనసేనకు కేటాయించారు. ఇది టిడిపి నాయకులు తప్పు పట్టకపోయినప్పటికీ తాము కోరుకున్న స్థానాలను లేదా తమకు బలంగా ఉన్న స్థానాలను జనసేనకు ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏకంగా కన్నీరు పెట్టుకున్న ఉదంతాలు, అలాగే శ్రీకాకుళం లో మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివి పార్టీలో హైలెట్ గా మారాయి. ఇవి ఒకరకంగా చిన్నవే అయినప్పటికీ ఎన్నికల సమయానికి కూటమిపై ప్రభావం చూపించే అవకాశం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపిలో ఎంపికల విషయంలో కూడా తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు. తాము కోరుకున్న వారికి లేదా తాము ఆశించిన వారికి అవకాశం కల్పించలేదని అధిష్టానం పై ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా కొనసాగితే పార్టీకి నష్టం వస్తుందని భావిస్తున్న చంద్రబాబు.. నామినేషన్ల పర్వం పూర్తి కాగానే అంటే ఒకటి రెండు రోజుల్లోనే ఆయన పార్టీ నాయకులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. అదేవిధంగా తానే స్వయంగా అవసరమైతే జిల్లాల్లో పర్యటించాలని కూడా నిర్ణయించుకున్నారు. తద్వారా ప్రస్తుతం నెలకొన్న అసంసత్తులు, సమస్యలు పరిష్కారం అవుతాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి గెలుపు ఓటముల కంటే కూడా కూటమిగా ఉన్న జనసేన పార్టీపై ఎక్కువగా చంద్రబాబు దృష్టి పెడుతున్నారనే చెప్పాలి. 21 మున్సిపాలిటీ స్థానాలతో పాటు నాలుగు కార్పొరేషన్ స్థానాలను ఇచ్చిన నేపథ్యంలో వాటిలో ఆ పార్టీని గెలిపించుకోవడం ద్వారా కూటమిగా ఐక్యంగా ఉన్నామన్న సంకేతాలను బలంగా పంపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక చూస్తూ ఊరుకుంటే కుదరదని క్షేత్రస్థాయిలో ఏర్పడిన సమస్యలను తానే స్వయంగా పరిష్కరించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు మంత్రులు.. జిల్లాల ఇన్చార్జి మంత్రులు కూడా స్థానికంగా ఉన్న క్యాడర్ కు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఈ సర్దుబాట్లు పెద్దగా ఫలించే అవకాశం కనిపించడం లేదని అంచనా వేస్తున్న నేపథ్యంలో కచ్చితంగా చంద్రబాబు రంగంలోకి దిగుతారని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బెంగళూరు నుంచి తాడేపల్లికి జగన్.. మున్సిపల్ ఎన్నికల వేడి, ఎస్ఈసీతో భేటీ



మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌ల పర్వంలో హింస, ఎన్నికల సంఘం పనితీరుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నామినేషన్ల సందర్భంగా పులివెందుల, పుంగనూరు, రాయచోటి, రాజంపేట వంటి ప్రాంతాల్లో వైసీపీపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన ఆదివారం బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చారు. ముందుగా ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఎన్నికల అధికారులు, పోలీసుల పనితీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గలేక అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా దౌర్జన్యాలకు తెగబడుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వడం లేదని, నామినేషన్ కేంద్రాల వద్దే పత్రాలను చించివేస్తూ, అభ్యర్థులపై భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. పుంగనూరులో పార్టీ లోక్‌సభ పక్షనేత పీవీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం, పులివెందులలో పోలీసులు గాలిలోకి కాల్పులు జరపడం, బాష్పవాయువు ప్రయోగించడం వంటి సంఘటనలు రాష్ట్రంలో ఏరకమైన 'గూండా రాజ్' నడుస్తోందో నిరూపిస్తున్నాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికెగిరిపోవడంతో, మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామనే నమ్మకం లేకనే చంద్రబాబు ఈ విధ్వంసకాండకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఎన్నికల వ్యవస్థల నియామకం పనితీరుపై జగన్ కొన్ని కీలకమైన సంస్కరణలను డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల నియామకం ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాల ఆధారంగా జరగకూడదని స్పష్టం చేశారు. కేంద్రంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) నియామకం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధాని, విపక్ష నేతలతో కూడిన కమిటీ ద్వారా జరగాలని సూచించారు. అదే రీతిలో రాష్ట్రంలో ఎస్ఈసీ నియామకం కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతల సంయుక్త నిర్ణయంతో జరగాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్ఈసీ, సీఈసీ నియామకాలను ప్రభుత్వం నిర్ణయించే విధానాన్ని తమ ప్రభుత్వం కూడా సమర్థించిందని, అయితే ఆ రోజు తాము చేసిన తప్పుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నామని, విద్యార్థులే ఎగ్జామినర్‌ను ఎన్నుకున్నట్లుగా ఈ విధానం ఉందన్నారు.

ప్రస్తుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వైఖరిపై వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అనిల్ చంద్ర పునేఠా తీరుపై నాడు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి విధుల నుంచి తొలగించిందని గుర్తుచేశారు. పదవీ విరమణ పొందిన అటువంటి వ్యక్తిని చంద్రబాబు మళ్లీ ఏపీ ఎస్ఈసీగా తీసుకొచ్చారని, ఆయన వీరవిధేయుడిగా మారి కూటమి ప్రభుత్వం చెప్పినట్లే నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే నామినేషన్ కేంద్రాల వద్ద కేంద్ర పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను మారుస్తారనే అనుమానాలు ఉన్నందున స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లలో సీసీ కెమెరాల నిఘా పెట్టాలని మరియు 17జ ఫారమ్‌లలో ఫోర్జరీ సంతకాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చివరగా, కూటమి ప్రభుత్వం నాటుతున్న ఈ విష విత్తనాలు రాబోయే రోజుల్లో పెద్ద చెట్లు అవుతాయని, అరాచకాలకు కొమ్ముకాస్తున్న అధికారులకు జగన్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రతి అధికారికి సంబంధించిన సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక అన్యాయం చేసిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి శిక్షిస్తామని స్పష్టం చేశారు. అధికారులు చంద్రబాబుకు కాకుండా ప్రజాస్వామ్యానికి, చట్టానికి సెల్యూట్ చేయాలని హితవు పలికారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం 'స్టార్టింగ్ లైన్' మాత్రమేనని, 2029 సాధారణ ఎన్నికలే 'ఫినిషింగ్ లైన్' అని పేర్కొన్న జగన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పట్టుదలే రాబోయే రోజుల్లో బాబు ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని, పార్టీ ఎప్పుడూ ప్రజల గొంతుకై నిలబడుతుందని భరోసా ఇచ్చారు.

# సీనియర్ Vs సిన్సియర్... ఆసక్తికరంగా విశాఖ మేయర్ రేసు





రాష్ట్రంలోని అతిపెద్ద నగరపాలక సంస్థ విశాఖపట్నంలో మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఈ మేయర్ సీటును ఎందరో హేమాహేమీలు ఆశించగా, టీడీపీ అధిష్టానం అనూహ్యంగా యువ మహిళా నేతను రంగంలోకి దింపి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు అత్యంత కీలకమైన విశాఖ కార్పొరేషన్ పై పట్టుబిగించే ఉద్దేశంతో విపక్షం వైసీపీ కూడా వ్యూహాత్మకంగా పావులు కదిపింది. ఎవరూ ఊహించని విధంగా విశాఖ నుంచి సీనియర్ నేత వరుదు కల్యాణిని బరిలో దింపింది. ఈ పరిణామంతో విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణి హాట్ ఫేవరెట్ గా పోటీకి దిగినా, ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణి సీనియార్టీ, నగరవ్యాప్తంగా ఉన్న పరిచయాలు, వాగ్దాటితో గట్టిపోటీ ఇస్తున్నట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో విశాఖ రేసు ఎలా ఉంటుందనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

విశాఖ కార్పొరేషన్ లో దాదాపు 18 లక్షల ఓటర్లు ఉన్నారు. 120 డివిజన్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద నగర పాలక సంస్థగా విశాఖ గుర్తింపు తెచ్చుకుంది. ఇక భౌగోళికంగా, ప్రాంతీయంగా రాజకీయంగా ఉన్న ప్రాధాన్యతలు కూడా విశాఖ సీటును హాట్ హాట్ గా మార్చేశాయి. అదేసమయంలో ప్రత్యక్ష విధానంలో ఎన్నిక జరుగుతుండటం కూడా మేయర్ పదవికి క్రేజ్ పెంచింది. ఈ నేపథ్యంలో అధికార, విపక్షాల మధ్య పోటీ ఎలా ఉంటుందనే అంశంపై విస్తృత చర్చలు సాగుతున్నాయి. 1858లో మున్సిపాలిటీగా ఆవిర్భవించిన విశాఖ 1979లో కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయింది. 1981లో తొలిసారి మేయర్ ఎన్నిక జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు ఆరు సార్లు ఎన్నికలు జరిగితే ఏడుగురు మేయర్లుగా పనిచేశారు. ఇందులో టీడీపీ ఒకసారి డైరెక్టుగా గెలవగా, తాజా మాజీ మేయర్ పీలా శ్రీనివాసరావు గత పాలకవర్గంపై కార్పొరేటర్ల తిరుగుబాటుతో పదవిని దక్కించుకున్నారు. ఇలా 40 ఏళ్ల విశాఖ కార్పొరేషన్ లో కేవలం రెండు సార్లు మాత్రమే టీడీపీ అధికారం చెలాయించింది.

### బలంగా టీడీపీ

ఇక ప్రస్తుత కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ బలమైన కేడర్ తో బరిలోకి దిగింది. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 8 మంది ఎమ్మెల్యేలు ఉండగా, అందరూ కూటమి నేతలే కావడం గమనార్హం. ఇక విశాఖ ఎంపీ శ్రీభరత్ టీడీపీకి అదనపు బలంగా చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి విజయంపై ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భౌగోళికంగా, రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సీటు కోసం పార్టీలో ఎందరో ప్రయత్నించినా, అధిష్టానం మాత్రం యువత, బీసీ కోటాలో డాక్టర్ ముక్కా శ్రావణికి ఎంపిక చేసింది. లోకల్ లీడర్ కావడం, మంచి విద్యార్హతలు, గతంలో కార్పొరేటర్ గా ఎన్నికైన అనుభవం శ్రావణికి కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. ఇక్కడ శ్రావణి గెలుపు వ్యక్తిగతంగా ఆమెకు అవసరమే అయినప్పటికీ, ఆమెను గెలిపించాల్సిన అవసరం ఎక్కువగా టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకే ఉందని అంటున్నారు. దీంతో శ్రావణి కూడా తన విజయం పట్ల ధీమాగా ఉన్నారని అంటున్నారు. మరోవైపు పార్టీకి సంప్రదాయంగా ఉన్న ఓటు బ్యాంకు, తొలి నుంచి పార్టీనే నమ్ముకుని ఉన్న నేపథ్యం శ్రావణికి అదనపు బలంగా చెబుతున్నారు.

### అభ్యర్థే వైసీపీ బలం

ప్రతికూల రాజకీయ పరిస్థితుల్లో విశాఖ మేయర్ పరీక్ష ఎదుర్కొంటున్న వైసీపీ తన అభ్యర్థి వరుదు కల్యాణిపైనే ఆశలు పెట్టుకుంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న కల్యాణి మంచి వాగ్దాటితో రాజకీయంగా మంచి ఇమేజ్ తెచ్చుకున్నారు. అనుభవం, నగరంలో పరిచయాలు ఆమెకు కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. ఇక నగరంలో పార్టీకి పెద్ద ఎత్తున ఉన్న కేడర్ తో ఆమె ఎన్నికలను ఎదుర్కొనేలా వ్యూహ రచన చేస్తున్నారు. అదేసమయంలో నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ ఓటర్లపైన కల్యాణి ఆశలు పెట్టుకున్నారు. విశాఖ నగరంలో పెద్ద ఎత్తున వలస ఓటర్లు స్థిరపడటం, తన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఓటర్లు ఫలితాన్ని శాసించే స్థితిలో ఉండటం కూడా వైసీపీ అభ్యర్థికి ఉత్సాహం ఇస్తోందని చెబుతున్నారు.

ఇలా రెండు పార్టీల వారు బీసీ మహిళలకు అవకాశం ఇవ్వడంతో మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారిందని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా పురోగమిస్తున్న విశాఖలో గెలవడం ద్వారా తమకు తిరుగులేదని సంకేతాలు ఇవ్వాలని కూటమి భావిస్తుండగా, ఎక్కడ కోల్పోయామో అక్కడ నుంచే మళ్లీ మొదలు పెట్టాలనే ఉద్దేశంతో విశాఖ మేయర్ సీటుపై సర్వశక్తులు ఒడ్డి నెగ్గాలని వైసీపీ భావిస్తోంది. గత ప్రభుత్వంలో పరిపాలనా రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామని ప్రచారం చేసిన వైసీపీ ఆ దిశగా తీసుకున్న చర్యలను వివరించేలా ప్రచారం చేయాలని భావిస్తోంది. తమ హయాంలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేశామని, కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో ఏమీ చేయలేదని చెబుతోంది. అయితే వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ విశాఖలో ఇప్పటివరకు టీడీపీనే ఆధిపత్యం ప్రదర్శిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ ఎన్నికల్లో ఎటువంటి ఫలితం వస్తుందనేది ఉత్కంఠ పెంచుతోందని అంటున్నారు.

# విజయవాడలో హైడ్రామా.. తగ్గేదేలే అంటున్న తమ్ముళ్లు.. పోటీకి సై అంటోన్న బీజేపీ

విజయవాడ నగరంలో పొత్తు రాజకీయాలు వేడి పుట్టిస్తున్నాయి. కూటమిలోని మూడు పార్టీలు సీట్ల సర్దుబాటులో బెట్టు చేస్తున్నాయి. శనివారం అర్ధరాత్రికి ఒక అవగాహనకు వచ్చినట్లు చెబుతున్నా, బీజేపీ వైఖరితో రాజకీయం హాట్ హాట్ గానే కొనసాగుతోంది. ఇదే సమయంలో తన నియోజకవర్గంలో ఎక్కువ డివిజన్లు జనసేనకు కేటాయించడాన్ని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో ఎంపీ కేశినేని చిన్నపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారని జరుగుతున్న ప్రచారం వాతావరణాన్ని వేడెక్కించింది. దీంతో నామినేషన్ల ఉపసంహరణ వరకు సీట్ల సర్దుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం కార్పొరేషన్ లో మేయరు సీటును జనసేనకు కేటాయించారు. ఇక నగరంలో 86 డివిజన్లను పార్టీల బలాబలాల మేరకు సర్దుబాటు చేసుకోవాలని భావించారు. అయితే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో తమ పార్టీకే ఎక్కువ సీట్లు కావాలని ఎమ్మెల్యేలు కోరుతుండటంతో పొత్తు చర్చల్లో చిక్కుముడులు పడ్డాయని అంటున్నారు. నగరంలో మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా, తూర్పు, సెంట్రల్ ఎమ్మెల్యేలు టీడీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే బీజేపీ. దీంతో తమ పరిధిలో తమ వారే కార్పొరేటర్లుగా పోటీ చేస్తారని సెంట్రల్ ఎమ్మెల్యే ఉమా, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పట్టుబడుతున్నారని అంటున్నారు.

ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా పలుమార్లు సమావేశమైన సమన్వయ కమిటీ సభ్యులు శనివారం అర్ధరాత్రికి ఒక నిర్ణయానికి వచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే ఏ నిర్ణయం తీసుకున్నారనే విషయమై అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడంతో కార్యకర్తల్లో గందరగోళం కనిపిస్తోందని అంటున్నారు. అనధికార సమాచారం ప్రకారం మొత్తం 86 డివిజన్లలో టీడీపీకి 58, జనసేనకు 21, బీజేపీకి 7 కేటాయించినట్లుగా చెబుతున్నారు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో 14 డివిజన్లు కావాలంటూ బీజేపీ డిమాండ్ చేస్తుండటంతో సర్దుబాటుపై అనిశ్చితి నెలకుందని అంటున్నారు. ఎవరు ఏమనుకున్నా బీజేపీ తరఫున 14 సీట్లలో పోటీ చేస్తామని ఆ పార్టీ నేతలు చేసిన ప్రకటన హై డ్రామాకు తెరలేపిందని చెబుతున్నారు. చర్చలు కొలిక్కి వచ్చినా మిత్రపక్షాలు చేస్తున్న ప్రకటనలతో టీడీపీ నేతలు, అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. ఓ పక్క నామినేషన్లకు చివరి రోజు కావడంతో తమ పరిస్థితి ఏంటి? అంటూ అభ్యర్థులు జుట్టు పీక్కుంటున్నారు. ఎమ్మెల్యేలకు ఫోన్లు చేస్తూ తమ పరిస్థితి తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఒత్తిడికి గురవుతున్న ఎమ్మెల్యేలు పార్టీ అగ్రనాయకత్వంపై అసహనం వ్యక్తం చేస్తూ తమ అనుచరులతో నామినేషన్లు వేయిస్తామని, తర్వాత చూసుకుందామని చెబుతూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారని అంటున్నారు.




### సొంతంగా బీజేపీ పోటీ

నగరంలోని 14 డివిజన్లలో పోటీ చేయాలని బీజేపీ నేతలు సొంతంగా నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం కూటమిలో చిచ్చు రేపుతోందని అంటున్నారు. బీజేపీకి 7 సీట్లు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి నెలకుందని అంటున్నారు. దీంతో కార్యకర్తలను చల్లార్చేందుకు తమకు బలం ఉన్న 14 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని బీజేపీ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తొలి నుంచి తాము 14 స్థానాలు అడుగుతుంటే కూటమి నేతలు ముందుగా 9 స్థానాలు ఇస్తామని చెప్పి, చివరికి 7 స్థానాలతో సర్దుకోవాలని అనడంపై బీజేపీ క్యాడర్ రగిలిపోతోందని అంటున్నారు. దీంతో ఆదివారం 14 డివిజన్లలో ముందు నామినేషన్ వేసి తర్వాత చర్చిద్దామన్నట్లుగా బీజేపీ వైఖరి ఉందని అంటున్నారు. దీంతో విజయవాడ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

# 'మోదీ వర్సెస్ యాంటీ మోదీ' వార్.. లండన్ వీధుల్లో భారత రాజకీయం.. అసలు కథేంటి?

విదేశీ గడ్డపై భారత రాజకీయ పరిణామాలు మరోసారి తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. లండన్ వీధుల్లో ఒకవైపు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం వినిపిస్తుంటే.. మరోవైపు దేశ ప్రతిష్ఠను చాటేలా కౌంటర్ ర్యాలీలు హోరెత్తుతున్నాయి. అసలు ఈ రచ్చ వెనుక ఉన్న రాజకీయ సమీకరణాలేంటి? ఇది ప్రజాస్వామ్య స్వేచ్ఛా ప్రకటనో లేక విదేశీ గడ్డపై పెరుగుతున్న రాజకీయ విభజన పరిణామమా? అన్నది హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కు వ్యతిరేకంగా కొన్ని విద్యార్థి సంఘాలు, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల తీరుపై వారు పలు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే ఈ నిరసనలకు ప్రతిస్పందనగా 'టీమ్ భారత్' పేరిట మరో ప్రవాస భారతీయుల బృందం రంగంలోకి దిగింది. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని 'భారత్ మాతా కీ జై' నినాదాలతో లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ఎదుట భారీ ర్యాలీ నిర్వహించింది. విదేశాల్లో దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలను తిప్పికొట్టడమే తమ ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఇక్కడ ఒకవర్గం ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును వినియోగించుకుంటుంటే.. మరొక వర్గం దేశ ప్రయోజనాలు, ప్రతిష్ఠకు మద్దతుగా తమ స్వరాన్ని వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఏమిటంటే ఒక రాజకీయ నాయకుడిని లేదా ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం అంటే దేశాన్ని వ్యతిరేకించడమేనా అనేదే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం.. ఎన్నికల వ్యవస్థపై సందేహాలను వ్యక్తం చేయడం.. అధికారుల పనితీరుపై విమర్శలు చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలో భాగమే. అదే సమయంలో విమర్శల పేరుతో దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని భావించే వారు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడం కూడా వారి హక్కే అవుతుంది. అందువల్ల భావోద్వేగాలతో ఒకరిపై ఒకరు 'దేశభక్తులు' లేదా 'దేశ వ్యతిరేకులు' అని ముద్రలు వేయడం కంటే.. ఆయా వర్గాలు లేవనెత్తిన అంశాల్లో ఎంతవరకు వాస్తవం ఉందనేది ఆధారాలతో పరిశీలించడమే సరైన ప్రజాస్వామ్య దృక్పథం. ఇక నిరసనల చుట్టూ అల్లుకున్న మరో వివాదం ఏమిటంటే మోదీ, సీఈసీలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ పౌరులు కూడా పాల్గొన్నారని.. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారనే ఆరోపణలు రావడం. అలాగే ఒక నిరసనలో కొందరు వ్యక్తులు చేసిన వివాదాస్పద చర్యలను మొత్తం విద్యార్థి లోకానికి లేదా ఒక దేశ ప్రజలందరికీ ఆపాదించడం కూడా సబబు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. డిజిటల్ మీడియా, సోషల్ మీడియా యుగంలో స్వదేశంలో జరిగే ప్రతి చిన్న రాజకీయ పరిణామం విదేశాల్లోని భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యే చిన్న చిన్న వీడియో క్లిప్పులు పూర్తి వాస్తవాన్ని చూపించకపోవచ్చు.. అక్కడ ఎవరి రాజకీయ భావజాలానికి అనుగుణంగా వారు కథనాలను ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. పైగా విదేశీ గడ్డపై జరిగే ఇలాంటి నిరసనలు అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించి.. భారత రాజకీయ వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీస్తాయి. ధ్రువ్ రాఠీ వంటి డిజిటల్ క్రియేటర్ల ప్రచారం ఆధారంగా కాకుండా విశ్వసనీయ నివేదికలతో ఎన్నారైలు రియాక్ట్ అయితేనే ఇలాంటివి జరుగకుండా ఉంటాయి. లండన్ వీధుల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలు భారత రాజకీయ ప్రభావం అంతర్జాతీయ స్థాయికి ఏ విధంగా పాకిందో స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని సమర్థించే హక్కు ఎంత ముఖ్యమో.. విమర్శించే స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం. 'టీమ్ భారత్' ర్యాలీ దేశానికి తమ మద్దతును తెలపగా.. వ్యతిరేక నిరసనకారులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ రెండింటిలో ఏది సరైనదో తేలాల్సింది రాజకీయ నినాదాలతో లేదా భావోద్వేగాలతో కాక వాస్తవాలు, ప్రామాణిక ఆధారాలు.. స్వేచ్ఛాయుతమైన ఆరోగ్యకరమైన చర్చల ద్వారానే.. విదేశాల్లో భారత పరువు ప్రతిష్టలకు సంబంధించిన ఈ విషయంలో భారతీయులు సంయమనం పాటిస్తే దేశ ప్రతిష్ట ఇనుమడిస్తుంది.



# ఏఐని ప్రేయసిగా భావించి.. ఉన్నదంతా అమ్ముకున్నాడు.. చివరకు అసలు నిజం తెలిసి షాక్



సోషల్ మీడియాలో పరిచయం.. చాటింగ్‌తో మొదలైన ప్రేమ.. 1,900 కిలోమీటర్ల ప్రయాణం.. ప్రేయసిని కలవాలన్న ఆశతో ఉన్నదంతా అమ్మేసిన వ్యక్తి.. తీరా అక్కడికి వెళ్లాక తెలిసిన అసలు నిజంతో షాక్.. ఆన్‌లైన్‌లో పరిచయమైన ఓ యువతిని ప్రేమించిన బ్రెజిల్‌కు చెందిన 49 ఏళ్ల వ్యక్తికి ఎదురైన అనుభవం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాను ప్రేమించిన యువతి నిజమైన వ్యక్తి కాదని.. ఏఐ సాయంతో సృష్టించిన పాత్ర అని తెలిసి అతడు నిర్ఘాంతపోయాడు.

**సోషల్ మీడియా పరిచయం.. ప్రేమగా మారిన చాటింగ్..**

టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనుషుల జీవితాల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారా కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం.. స్నేహాలు చేయడం.. ప్రేమలో పడటం సాధారణమైపోయింది. అయితే ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి వ్యక్తి నిజమైనవారేనా? వారి వెనుక ఉన్నది అసలు మనిషేనా? అనే విషయాలను నిర్ధారించుకోకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో తెలియజేసే ఘటన బ్రెజిల్‌లో చోటుచేసుకున్నట్లు సమాచారం. బ్రెజిల్‌కు చెందిన మార్టిన్స్ అనే 49 ఏళ్ల వ్యక్తికి 2020లో జెస్సికా పేరుతో ఉన్న ఓ సోషల్ మీడియా ఖాతా ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ ఖాతాలో ఉన్న యువతి ఫొటోను చూసిన అతడు ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్ కొనసాగడంతో ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. తనతో మాట్లాడుతున్నది నిజమైన యువతేనని నమ్మిన మార్టిన్స్.. ఆమెనే తన జీవిత భాగస్వామిగా ఊహించుకున్నాడు.

**1,900 కిలోమీటర్ల దూరం.. ప్రేయసిని కలవాలన్న ఆరాటం..**

ఆన్‌లైన్‌లో సాగిన పరిచయం.. చాటింగ్‌తోనే ఆగిపోలేదు. తన ప్రేయసిని ప్రత్యక్షంగా కలవాలన్న కోరిక మార్టిన్స్‌లో బలంగా పెరిగింది. ఆమెను చూసేందుకు సుమారు 1,900 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు కూడా సిద్ధపడ్డాడు. ఇందుకోసం బస్సు ప్రయాణానికి అవసరమైన డబ్బును సమకూర్చుకోవడానికి తన వద్ద ఉన్న వస్తువులను, ఆస్తులను అమ్ముకున్నట్లు సమాచారం.

ప్రేమించిన వ్యక్తిని కలుసుకోవాలన్న ఆశతో ఇంతటి సాహసానికి సిద్ధపడిన మార్టిన్స్.. తన ప్రయాణం తన జీవితంలోనే అతిపెద్ద నిరాశగా మారుతుందని ఊహించలేకపోయాడు. తాను ఎంతోకాలంగా చాటింగ్ చేస్తున్న యువతిని ప్రత్యక్షంగా చూసి.. ఆమెతో సమయం గడపవచ్చని ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఆ ఆశలతోనే బ్రెజిల్ లోని బెలో హొరిజోంటె నగరానికి చేరుకున్నాడు.

**చివరకు తెలిసిన నిజం.. అంతా ఏఐ మాయ..**

అయితే అక్కడికి చేరుకున్న తర్వాతే మార్టిన్స్‌కు అసలు విషయం తెలిసింది. తాను ప్రేమించిన జెస్సికా నిజమైన యువతి కాదని, ఓ వ్యక్తి ఏఐ సాయంతో సృష్టించిన క్యారెక్టర్ అని తెలుసుకుని షాక్‌కు గురయ్యాడు. తాను ఇన్నాళ్లూ ప్రేమించానని భావించిన వ్యక్తి వాస్తవంగా ఉనికిలోనే లేదన్న విషయం అతడిని తీవ్ర నిరాశకు గురిచేసింది.మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. తాను ఏఐతో చాట్ చేస్తున్నాననే అనుమానం తనకు ఎప్పుడూ రాలేదని మార్టిన్స్ చెప్పడం. ఆన్‌లైన్‌లో జరిగిన సంభాషణలను నిజమైన ప్రేమగా భావించి.. ఆమెను కలుసుకోవడానికి తనకున్నదంతా ఖర్చు చేయడం ఈ ఘటనలో ప్రధానంగా చర్చకు వస్తోంది.

**ఏఐ యుగంలో ఆన్‌లైన్ ప్రేమకు కొత్త సవాళ్లు**

కృత్రిమ మేధస్సు సాయంతో మనుషులను పోలిన ఫొటోలు, వీడియోలు, స్వరాలు, సంభాషణలు సృష్టించడం ఇప్పుడు మరింత సులభమవుతోంది. దీంతో సోషల్ మీడియాలో కనిపించే ఫొటోలు, ప్రొఫైళ్లు, సందేశాలు నిజమైన వ్యక్తులకు సంబంధించినవేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఏఐ ఆధారిత క్యారెక్టర్లు వినోదం, సమాచార సేవలు,

వర్చువల్ స్నేహం వంటి అవసరాలకు ఉపయోగపడుతున్నప్పటికీ.. వాటి అసలు స్వరూపాన్ని దాచిపెట్టి వ్యక్తిగత సంబంధాలను పెంచుకోవడం సమస్యలకు దారితీయవచ్చు.ముఖ్యంగా ఆన్‌లైన్ పరిచయాల విషయంలో భావోద్వేగాలకు లోనై ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం ప్రమాదకరం. ప్రత్యక్షంగా కలవని వ్యక్తుల కోసం డబ్బు పంపించడం.. అప్పులు చేయడం.. ఆస్తులు అమ్ముకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. అలాగే అనుమానాస్పద ఖాతాల వెనుక ఉన్న వ్యక్తుల నిజస్వరూపాన్ని నిర్ధారించుకోవడం అవసరం. మార్టిన్స్‌కు ఎదురైన అనుభవం టెక్నాలజీని ఉపయోగించడంలో అప్రమత్తత ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. ఆన్‌లైన్‌లో ఏర్పడిన ప్రతి బంధాన్ని గుడ్డిగా నమ్మడం కంటే.. నిజానిజాలను తెలుసుకున్న తర్వాతే ముందడుగు వేయాలి. ఎందుకంటే.. డిజిటల్ ప్రపంచంలో కనిపించే ప్రేమ నిజమైనదే కావాలని లేదు. కొన్నిసార్లు అది మనిషి సృష్టించిన పాత్ర కావచ్చు.. మరికొన్నిసార్లు ఏఐ సృష్టించిన మాయ కూడా కావచ్చు.. సో బీ కేర్ ఫుల్ నాయనలారా..

# మండుతోన్న యూరోప్.. అసలు కారణమేంటి?



ప్రశాంతమైన జీవనానికి.. సంపన్న సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తాయి యూరోపియన్ దేశాలు. చరిత్రలోకి వెళితే ఒకప్పుడు ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని వందలాది దేశాల్ని శాసించటమే కాదు.. భారీ ఎత్తున సహజ వనరులను కొల్లగొట్టటం..తమ ఆధిక్యతను నిలుపుకోవటానికి కోట్లాది మంది ప్రాణాలను తీసేందుకు సైతం వెనుకాడని చరిత్ర యూరోప్ సొంతం. దాదాపు 500 ఏళ్లు ఐరోపా ఖండానికి చెందిన బ్రిటన్.. ఫ్రాన్స్.. పోర్చుగల్.. డచ్.. బెల్జియం..దేశాలు ప్రపంచంలోని పలు దేశాల్ని వలసవాదంతో పాలించాయి. వారి సహజవనరుల్ని కొల్లగొట్టాయి. భారతదేశంతో పాటు పలు ఆసియా దేశాల్ని.. ఆఫ్రికా ఖండంలోని దేశాలు మాత్రమే కాదు.. ఇప్పటి ప్రపంచానికి పెద్దన్న అమెరికాను సైతం యూరోపియన్ దేశాలే పాలించాయి.

ప్రపంచ దేశాల సంపదను.. వనరులను దోచుకోవటంలో ఏ మాత్రం మొహమాటం.. పాపభీతిని ప్రదర్శించని ఈ దేశాలు ఆర్థికంగా బలపడటమే కాదు.. సంపన్నంగా మారాయి. విలాసవంతమైన జీవనానికి తెర తీశాయి. వారి అధీనంలోని వలస రాజ్యాలు స్వాతంత్ర్యాన్ని సొంతం చేసుకోవటం.. ఏ దేశానికి ఆ దేశం తమ ఆస్తిత్వాన్ని చాటుకోవటంతో కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలిన ఆ దేశాలు ఇప్పుడు అశాంతికి చిహ్నాలుగా మారాయి. ఉపాధి కోసం.. పెరిగిన ధరలు.. విద్యా వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలంటూ తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆయా దేశాలకు చెందిన పౌరులు రోడ్ల మీదకు వస్తున్నారు. సొంత ప్రభుత్వాల మీదే ఆందోళనలు చేస్తూ.. న్యాయం చేయాలంటూ ఉద్యమిస్తున్న వైనం ఇప్పుడు యూరోప్ లోని పలు దేశాల్లో కనిపిస్తోంది.ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తింపు ప్రకారం ఐరోపా ఖండంలో మొత్తం 44 దేశాలు ఉండగా.. యూరోపియన్ యూనియన్ లో మాత్రం 27 దేశాలు ఉన్నాయి. వారందరికి ఒకే కరెన్సీ (యూరో) చెలామణిలో ఉన్న సంగతి తెలిసిందే. యూరోప్ దేశాలకు భౌగోళిక సరిహద్దులుగా రష్యా.. టర్కీ.. కజకిస్తాన్.. జార్జియా.. అజర్ బైజాన్ లాంటి దేశాలు ఉన్నాయి. తాజాగా నిరసనలతో అట్టుడుగుతున్న దేశాలుగా ఫ్రాన్స్.. బెల్జియం.. పోర్చుగల్.. ఇటలీ.. గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారుల నిరసనలతో మండుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.ఫ్రాన్స్ విషయానికి వస్తే.. అక్కడి స్కూళ్లలో మౌలిక వసతుల కొరత.. టీచర్ల కొరతతో పాటు.. పెరిగిన జీవన వ్యయం.. ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. అక్టోబరు 17-18 తేదీల్లో జరిగిన నిరసనల్లో లక్షలాది మంది పాల్గొనటం గమనార్హం. పారిస్.. మార్సేయ్ లాంటి నగరాల్లోని ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు జరగటం గమనార్హం. బెల్జియం విషయానికి వస్తే..అక్కడి వర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు.. విద్యారంగంలో బడ్జెట్కోతలు.. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలపై అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. విద్యార్థుల నిరసనలతో రాజధాని బ్రస్సెల్స్ నగరం అట్టుడుతోంది. ఆందోళనకారులను అడ్డుకోవటం కోసం పోలీసుల లాఠీ ఛార్జ్ తో పాటు టియర్ గ్యాస్.. వాటర్ క్యానన్లను ప్రయోగించాల్సిన పరిస్థితి.పోర్చుగల్ విషయానికి వస్తే తక్కువ వేతనాలు.. జీవన వ్యయాలు పెరగటంతో పాటు ఆ దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంటి అద్దెలు భారీగా పెరగటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇటలీలో పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా భారీ నిరసనలుచోటు చేసుకుంటున్నాయి. సామాజిక సంక్షేమ బడ్జెట్లను కాపాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక.. విద్యా సంస్కరణలు.. బడ్జెట్ కోతలు.. ఆర్థిక ఇబ్బందులపై గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనలు కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలకు కారణంగా మారుతున్నాయి.ఎందుకిలా జరుగుతోంది? అన్న ప్రశ్నకు సమాధానం వెతికితే.. ఆసక్తికర అంశాలు తెర మీదకు వస్తాయి. డోమినో ఎఫెక్ట్ గా కొందరు విశ్లేషిస్తున్నారు. ఒక దేశంలో విజయవంతమైన పోరాటం.. దాని పక్కనే ఉన్న దేశంలోని ప్రజల్లో స్ఫూర్తిని నింపటంతో పాటు.. తెర వెనుక ఉన్న కొన్ని శక్తులు.. వ్యవస్థాగత లోపాలను ఎత్తి చూపుతూ ఆందోళనలకు తెర తీస్తున్నారు. దీంతో నిరసనలు పెరుగుతున్న దేశాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. చైన్ సిస్టం మాదిరిగా ఉన్న నిరసనలకు సోషల్ మీడియా (టిక్ టాక్.. టెలిగ్రామ్.. ఎక్స్.. యూట్యూబ్.. ఇన్ స్టా) కీలకంగా మారుతున్నాయి.

ఆందోళనకారులు.. నిరసనకారులు తమ వాదనల్ని వినిపించేందుకు ఈ వేదికల్ని ఆయుధాలుగా వినియోగిస్తున్నాయి. తమదైన నెరెటివ్ ను క్రియేట్ చేసి జనాల మీదకు వదులుతున్నాయి. ఒక దేశంలోని నిరసనలు.. మరో దేశంలోని ఆందోళనకారులకు స్ఫూర్తిగా మారుతున్నాయి. ఫ్రాన్స్ లో విద్యార్థులు.. కార్మికులు రోడ్ల మీదకు వచ్చి అక్కడి ప్రభుత్వానికి చెమటలు పట్టించిన విజువల్స్ నిమిషాల వ్యవధిలో ఆ దేశానికి దగ్గర్లోని బెల్జియం.. పోర్చుగల్ యూత్ కు చేరటం.. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనల బాట పట్టటమే అన్న భావన యువతలో వేగంగా పెరుగుతోంది. దీనికి తోడు ఐరోపా వ్యాప్తంగా ఉన్నకార్మిక సంఘాలు.. విద్యార్థి సంఘాలు డిజిటల్ గ్రూపుల ద్వారా కనెక్ట్ అవుతూ.. తమ నిరసనల వ్యూహాలను. .నినాదాలను మరో దేశానికి ఆందోళనలకు ముడి సరుకుగా అందిస్తున్నాయి. యూరోప్ లో జరుగుతున్న ఈ వరుస ఆందోళన వెనుక బయట శక్తులు కూడా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉక్రెయిన్ - రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ కు ఐరోపా దేశాలు మద్దతు ఇస్తున్నాయి. దీనికి ప్రతీకారంగా రష్యా లాంటి దేశాల డిజిటల్ వేదికల్ని ఆయుధాలుగా మార్చుకొని ఆ దేశాల్లోని అంతర్గత సమస్యల మీద ఫోకస్ చేస్తున్నట్లుగా కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో నిరసనలను మరింత పెంచేలా ఫేక్ అకౌంట్లు.. బాట్లు కుప్పలుగా

వెల్లువెత్తతూ.. సరికొత్త సవాళ్లను విసురుతున్నట్లుగా చెబుతున్నారు. దీంతో పాటు గడిచిన కొన్నేళ్లుగా మధ్యప్రాచ్యం.. ఆఫ్రికా దేశాల నుంచి వలసలు భారీ ఎత్తున పెరగాయి. దీంతో.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు తగ్గాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ నిధులు వలసదారులకు వెళుతున్నాయన్న అసంతృప్తి అంతకంతకూ పెరిగి ఆగ్రహంగా మారినట్లుగా చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. ఒకప్పుడు ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో ఉంచుకొని వారిపై అధికారం చెలాయించారో.. ఇప్పుడు ఆయా దేశాలకు చెందిన వలసలు ఐరోపా దేశాల్లో కలకలాన్ని క్రియేట్ చేస్తున్న వైనం చూస్తే..కర్మ ఎవరిని వదిలి పెట్టదన్న భావన కలుగక మానదు. కాకపోతే కొన్ని దశాబ్దాల సమయం పట్టిందంతే.

# కొవ్వూరు రాజకీయాల్లో ట్విస్టుల మీద ట్విస్టులు.. రెండు పార్టీల అభ్యర్థుల ఎంపికలోనూ గందరగోళం




గోదావరి జిల్లాల్లోని ప్రధానమైన కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ ప్రధాన పార్టీలు రెండింటి లోనూ గందరగోళమే రాజ్యమేలుతోంది. అధికార టీడీపీ కూటమిలో స్థానిక నేతలు అంతా ఒక అభ్యర్థిని పోటీకి దింపగా, అధిష్టానం అనూహ్యంగా వేరొకరికి పేరును ఖరారు చేసింది. స్థానిక నాయకులు అంతా తాము అనుకున్న అభ్యర్థితో నామినేషన్ వేయించగా, పార్టీ అధిష్టానం విడుదల చేసిన జాబితాలో వేరే నేత పేరు చూసి కంగుతిన్నారు. అటు విపక్షం వైసీపీలోనూ ఇంచుమించు ఇటువంటి పరిస్థితే నెలకొంది. పార్టీ తరపున చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించిన నేత పోటీకి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ అధిష్టానం కంగారు పడుతోందని అంటున్నారు.

**షాక్ ఇచ్చిన టీడీపీ అధిష్టానం**

కొవ్వూరు టీడీపీలో అధిష్టానం నిర్ణయం కార్యకర్తలను షాక్ కు గురిచేసింది. ఈ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు పార్టీ సీనియర్ నేత మద్దిపట్ల శివరామకృష్ణ మద్దతుతో పార్టీ అభ్యర్థిగా కంతామణి విజయలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది పార్టీ కార్యకర్తల సమక్షంలో అట్టహాసంగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఇంతలోనే రెండో విడత జాబితా విడుదల చేసిన టీడీపీ అధిష్టానం కొవ్వూరు సీటును జొన్నలగడ్డ రాధారాణికి ఖరారు చేసింది. ఈ పరిణామంతో పార్టీ కార్యకర్తలు నేతలు కంగుతిన్నారు. తాము విజయలక్ష్మి పేరునే అధిష్టానానికి సూచించగా, అధిష్టానం రాధారాణి పేరును ఎలా ఎంపిక చేసిందో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, పార్టీ నేత శివరామకృష్ణ చెబుతున్నారు.

**నిర్ణయం మారుతుందా?**

పార్టీ నేతలు అంతా ఒకరిని అనుకుంటే, అధిష్టానం వేరొకరికి అవకాశం ఇవ్వడం పట్ల కార్యకర్తల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధిష్టానం నిర్ణయాన్ని నిరసిస్తూ పార్టీ స్థానిక కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. తమ నేత కంతమణి విజయలక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, స్థానిక నాయకుల అభీష్టానికి భిన్నంగా అధిష్టానం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జొన్నల గడ్డ రాధారాణికి సీటు ఎలా కేటాయించిందో అర్థం కావడం లేదని కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక నేతలు ఎవరో రహస్యంగా సహకరించి ఉంటారని అనుమానిస్తున్నారు. కార్యకర్తల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అధిష్టానం నిర్ణయం మార్చుకుంటుందా? లేదా? అనేది చూడాల్సివుందని అంటున్నారు.

**వైసీపీ నుంచి పోటీకి విముఖత**

ఇక విపక్షం వైసీపీలోనూ పరిస్థితులు గందరగోళంగానే ఉన్నాయి. ఇక్కడ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన మన్నె పద్మ పోటీకి విముఖతగా ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ తన పేరు ప్రకటించిన తర్వాత ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. దీంతో పార్టీ నేతలు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు తదితరులు ఆమెను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. పద్మ తండ్రి స్థానికంగా మంచి పట్టున్న నేతగా చెబుతున్నారు. ఐదుసార్లు మున్సిపల్ చైర్మన్ గా పనిచేశారు. ఎమ్మెల్సీగానూ పనిచేశారు. దీంతో ఆయన కుమార్తెను వైసీపీ ఎంపిక చేసింది. అయితే కూటమి పార్టీలు బలంగా ఉన్న నేపథ్యంలో విజయంపై నమ్మకం లేక పద్మ తప్పుకున్నట్లుగా చెబుతున్నారు. మొత్తానికి కొవ్వూరులో రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయి. ఈ రోజు నామినేషన్లకు చివరి రోజు కావడంతో వైసీపీ ఎవరిని రంగంలోకి దింపుతుందో చూడాల్సివుందని అంటున్నారు.

## ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్.. ప్రేమ పెళ్లిళ్ల బాధ్యత కూడా ప్రభుత్వానిదేనా?



ప్రేమించడం వ్యక్తిగత విషయం.. జీవిత భాగస్వామిని వెతుక్కోవడం ఎవరి ఇష్టం వారిది. కానీ సింగపూర్‌లో మాత్రం ఈ విషయంలో ప్రభుత్వమే కాస్త చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దేశంలో జననాల రేటు తగ్గిపోతుండటంతో ప్రజలు తమకు సరైన భాగస్వామిని వెతుక్కునేందుకు 'ఫస్ట్‌డేట్' (ఖీఱతీర్‌ఆఓవ) పేరుతో ఓ డేటింగ్ యాప్‌ను పరీక్షిస్తున్నట్లు సమాచారం.ఈ యాప్‌ను 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారికి వారి అభిరుచులు, హాబీలు, జీవనశైలి ఆధారంగా సరైన జోడీని సూచించడం దీని ఉద్దేశం. సాధారణ డేటింగ్ యాప్‌ల మాదిరిగా ఒకేసారి చాలామందితో పరిచయం పెంచుకునే అవకాశం కాకుండా, ఒక్కోసారి ఒకరితో మాత్రమే కనెక్ట్ అయ్యే విధానం ఇందులో ఉన్నట్లు సమాచారం. వినియోగదారులు ప్రభుత్వ డిజిటల్ ఐడీ ద్వారా తమ గుర్తింపును కూడా ధ్రువీకరించుకోవాలి.2025లో సింగపూర్‌లో 30 వేల కంటే తక్కువ మంది పిల్లలు జన్మించినట్లు నివేదికలు వెల్లడించాయి. దీంతో భవిష్యత్తులో జనాభా పరిస్థితిపై అక్కడ ఆందోళనలు పెరుగుతున్నాయి.ఇక అసలు ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ప్రేమ కోసం యాప్‌లలో వెతుకులాట సాగించే రోజుల్లో, ఇప్పుడు ప్రభుత్వమే జోడీని వెతికే ప్రయత్నం చేస్తోందన్నమాట! అయితే ఇందులోనూ కొన్ని షరతులున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులే ఎందుకు? 35 ఏళ్లు దాటినవారికి ప్రేమించే అవకాశం లేదా? ప్రైవేట్ ఉద్యోగులు మాత్రం ఏం పాపం చేశారు? అంటూ ప్రశ్నలు రావడం సహజం.ప్రస్తుతం ఈ కార్యక్రమం ప్రయోగాత్మక దశలో ఉన్నట్లు సమాచారం. ఇది ఎంతవరకు విజయవంతమవుతుందో చూడాలి. చివరికి ఈ యాప్ ఎన్ని జంటలను కలుపుతుంది, జననాల రేటుపై ఎంత ప్రభావం చూపుతుంది అన్నది భవిష్యత్తే చెప్పాలి. ఏదేమైనా, ప్రేమకు కూడా ప్రభుత్వ ప్రణాళికలు అవసరమయ్యే పరిస్థితి వచ్చిందన్నమాట!



# రక్తం పులుపెక్కుతోంది

వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ (సీవో2) మోతాదులు పెరగటం పెద్ద నష్టమే కలిగిస్తోంది. వేడిగాలులు, కరవులు, కార్చిచ్చులు, భీకర తుపాన్ల వంటి పర్యావరణ విపత్తులే కాదు.. ఆరోగ్యానికీ పెను ప్రమాదం తెచ్చిపెడుతోంది. వాతావరణంలోని మార్పులు రక్తంలోనూ రసాయన మార్పులకు కారణమవుతున్నట్టు, ఇది ప్రమాదకర పరిణామాలకు దారితీస్తున్నట్టు ఎయిర్ క్వాలిటీ, అట్మాస్ఫియర్ అండ్ హెల్త్ పత్రికలో ప్రచురితమైన తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. కార్బన్ డయాక్సైడ్ మన రక్తంతో ఆడుకోవటం కొత్తేమీ కాదు. ఆదిమ మానవులు ఎదుగుతున్న సమయంలో వాతావరణంలో సీవో2 280 పీపీఎం స్థాయిలో ఉండేది. అంటే ప్రతి పది లక్షల భాగాల్లో ఒక వంతుగా ఉండేదన్నమాట. పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంతవరకూ అలాగే కొనసాగుతూ వచ్చింది కూడా. ఫ్యాక్టరీ గొట్టాల్లోంచి గ్రీన్‌హౌజ్ వాయువులు వెల్లువెత్తటంతో 1900 సంవత్సరం వచ్చేసరికి సీవో2 మోతాదులు 300 పీపీఎంకు, 1980 నాటికి 330 పీపీఎంకు పెరిగాయి. అప్పటి నుంచీ ఎగబాకుతూనే వస్తోంది. ఇప్పుడిది ఏకంగా 425 పీపీఎంకు చేరుకుంది. ఇది మన భూమి ఆరోగ్యానికే కాదు, శరీర ఆరోగ్యానికీ చేటే. మన శరీరాలు అలవడిన మోతాదుకు మించి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకునే స్థితికి చేరుకున్నాం. ఇంటా బయటా మనం పీల్చుకునే ప్రతి శ్వాసతోనూ ఇది పెద్దమొత్తంలో ఒంట్లోకి వెళ్తోంది. దీని ప్రభావాన్ని నిర్ధారించటానికే ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, కర్టిన్ యూనివర్సిటీ పరిశోధకులు దృష్టి సారించారు. మొత్తం 21 ఏళ్ల పాటు సాగిన అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సర్వే వివరాలను క్షుణ్నంగా విశ్లేషించారు. పర్యావరణ కాలుష్య కారకాలకు శరీరం ఎలా స్పందిస్తుందో తెలుసుకోవటానికి ఈ సర్వేలో ప్రతి సంవత్సరం 7000 మంది రక్త నమూనాలను తీసుకున్నారు. రక్తంలో సీవో2 మోతాదులను ప్రతిబింబించే బైకార్బొనేట్ అనే రసాయన సూచిక ఆధారంగా ప్రభావాలను అంచనా వేశారు. మొత్తం సర్వే కాలంలో వాతావరణంలో సీవో2 మోతాదులు 369 పీపీఎం నుంచి 420 పీపీఎంకు ఎగబాకగా.. రక్తంలో బైకార్బొనేట్ మోతాదులు 7% పెరిగినట్టు తేలటం గమనార్హం.

### రక్తం ఆమ్ల పూరితం

కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకుంటున్నకొద్దీ సముద్రాల్లో ఆమ్లం ఎక్కువవుతుంది. మన రక్తమూ అంతే. ఆమ్లగుణం పెరుగుతుంది. ఇది పెరగకుండా చూడటానికే బైకార్బొనేట్ తోడ్పడుతుంది. ఒకరకంగా దీన్ని కార్బన్ డయాక్సైడ్ 'షాక్ అబ్జార్బర్' అనుకోవచ్చు. ఇది రక్తంలో మితిమీరిన కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించుకుంటుంది. బైకార్బొనేట్ మోతాదులు పెరుగుతున్నాయంటే శరీరం అధిక సీవో2కు మూల్యం చెల్లించుకుంటోందనే అర్థం. సీవో2 మోతాదులు ఒకమాదిరిగా పెరిగినా తలనొప్పి, అలసట, ఏకాగ్రత తగ్గటం, నిర్ణయాలు సరిగా తీసుకోలేకపోవటం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నట్టు స్వల్పకాల అధ్యయనాలు సూచిస్తున్నాయి. జంతువులపై నిర్వహించిన దీర్ఘకాల అధ్యయనాల్లోనైతే మరింత తీవ్ర దుష్ప్రభావాలూ కనిపించాయి. విశృంఖల కణాలను నిర్వీర్యం చేసే సామర్థ్యం సన్నగిల్లటం, కణ అంతర్గత వాపు (ఇన్‌ఫ్లమేషన్).. కిడ్నీ, గుండెలో కణజాలం గట్టిపడటం, ఎముకల మీద ప్రభావాల వంటి వాటికీ దారితీస్తున్నట్టు వెల్లడైంది.

### క్యాల్షియం, పాస్ఫరస్ తగ్గుముఖం

అధిక సీవో2 మూలంగా– ఒకవైపు రక్తంలో బైకార్బొనేట్ మోతాదులు పెరుగుతుంటే.. మరోవైపు క్యాల్షియం, పాస్ఫరస్ తగ్గుతుండటం గమనార్హం. రక్తంలో మితిమీరిన కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించుకునే క్రమంలో శరీరం బైకార్బొనేట్‌ను పెద్దమొత్తంలో ఉత్పత్తి చేయటంతో పాటు సీవో2 అణువులను కార్బొనేట్ రూపంలో ఎముకల్లో నిల్వ చేస్తుంటుంది కూడా. ఈ ప్రక్రియకు క్యాల్షియం, పాస్ఫరస్ సహకరిస్తుండటం వల్ల అవి రక్తంలోంచి ఎముకల్లోకి చేరుకుంటాయి. దీంతో రక్తంలో వీటి మోతాదులు పడిపోతాయి. ఇదీ శరీర క్రియలను ప్రభావితం చేస్తుంది. క్యాల్షియం పడిపోతే కండరాలు పట్టేయటం, నిస్సత్తువ, వేళ్లు మొద్దుబారటం, సూదులు పొడిచినట్టు అనిపించటం, గుండెలయ అస్తవ్యస్తం కావటం వంటి వాటికి దారితీస్తుంది. ఇక పాస్ఫరస్ తగ్గితే బలహీనత, నీరసం, ఆక్సిజన్ సరఫరా తగ్గటం వంటివి తలెత్తుతాయి. మంచి విషయం ఏంటంటే– ఇంకా అలాంటి పరిస్థితి రాకపోవటం. కానీ పరిస్థితి ఇలాగే కొనసాగితే మాత్రం మున్ముందు ప్రమాదం తప్పదు.

### భావి తరాలకు ముప్పు

ప్రస్తుతం మన శరీరాలు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ మోతాదులకు అనుగుణంగా బాగానే సర్దుకుంటున్నాయి. చాలామందిలో పెద్దగా విపరీత లక్షణాలేవీ కనిపించటం లేదు. కానీ రోజురోజుకీ గ్రీన్‌హౌజ్ వాయువులు, ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం మనల్ని ప్రమాదంలోకి నెడుతోంది. భవిష్యత్ తరాలు దీనికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పుడు పుట్టే పిల్లలు మరింత ఎక్కువకాలం అధిక కార్బన్ డయాక్సైడ్ ప్రభావానికి గురవుతారు. గ్రీన్‌హౌజ్ వాయువుల కట్టడిని సమర్థంగా అమలు చేయలేకపోతే శతాబ్దం మధ్యలో సీవో2 మోతాదులు 500 పీపీఎం దాటొచ్చని అంచనా. అప్పుడు రక్తంలో కార్బన్ డయాక్సైడ్ మోతాదులను శరీరం తట్టుకోలేని స్థితికి చేరుకుంటుందని పరిశోధకులు వివరిస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా కళ్లు తెరవటం మంచిదని సూచిస్తున్నారు.

# జంక్ ఫుడ్ చూడగానే నోరూరుతోందా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో రుచికరమైన జంక్ ఫుడ్ వైపు మనసు మళ్లడం చాలా సహజం. పిజ్జాలు, బర్గర్లు, సమోసాలు వంటివి చూసినప్పుడు మన మెదడులో కలిగే 'క్రేవింగ్స్' మనల్ని నియంత్రించుకోనివ్వవు. అయితే ఇవి కేవలం తాత్కాలిక రుచిని మాత్రమే ఇచ్చి.. దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులకు కారణమవుతాయి. జంక్ ఫుడ్ తినాలనే బలమైన కోరికను మొగ్గలోనే తుంచివేసి, ఆరోగ్యకరమైన లైఫ్ స్టైల్ అలవర్చుకోవడానికిగల 7 ప్రభావవంతమైన చిట్కాలేంటో తెలుసుకుందాం. ఆఫీసు నుండి వస్తుంటే రోడ్డు పక్కన వేడివేడి సమోసాల వాసన మిమ్మల్ని లాగుతోందా? లేదా ఇంట్లో కూర్చున్నప్పుడు సడన్ గా పిజ్జా ఆర్డర్ చేయాలనిపిస్తోందా? నిజానికి ఇది మీకు ఆకలి వేయడం వల్ల వచ్చే కోరిక కాదు. మీ మెదడులో జరిగే కొన్ని రసాయన మార్పుల వల్ల కలిగే మాయాజాలం. ఈ క్రేవింగ్స్ లో చిక్కుకుంటే ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా జేబు కూడా ఖాళీ అవుతుంది. మరి మనల్ని మనం నియంత్రించుకుంటూ, ఆ జంక్ ఫుడ్ ఆలోచనల నుండి ఎలా బయటపడాలి? మీ లైఫ్ స్టైల్ ను మార్చేసే ఆ 7 అద్భుతమైన చిట్కాలు. చాలా సార్లు మన శరీరం దాహాన్ని ఆకలిగా తప్పుగా అర్థం చేసుకుంటుంది. ఏదైనా జంక్ ఫుడ్ తినాలని అనిపించినప్పుడు వెంటనే ఒక గ్లాసు నీరు తాగండి. ఒక 15 నిమిషాలు ఆగి చూడండి. అప్పుడు ఆ కోరిక ఆటోమేటిక్ గా తగ్గిపోవడాన్ని మీరు గమనిస్తారు. ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటే అది మీకు ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. గుడ్లు, పప్పు ధాన్యాలు, పనీర్ లేదా నట్స్ తీసుకోవడం వల్ల మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరిక కలగదు. నిద్రలేమి వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరం శక్తి కోసం చక్కెర, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతుంది. రోజుకు 7-8 గంటల గాఢ నిద్ర క్రేవింగ్స్‌ను అదుపులో ఉంచుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు శరీరం 'కార్టిసాల్' అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని తీపి, నూనె పదార్థాలు తినేలా ప్రేరేపిస్తుంది. యోగా, ధ్యానం లేదా నచ్చిన పనిని చేయడం ద్వారా ఈ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గాలని భోజనం మానేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయి విపరీతమైన ఆకలి పుడుతుంది. ఫలితంగా కళ్ల ముందు కనిపించిన జంక్ ఫుడ్‌ను ఆపలేనంతగా తినేస్తారు. కాబట్టి క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవడం ముఖ్యం. చిప్స్‌కు బదులుగా నట్స్ (జీడిపప్పు, బాదం) లేదా వేయించిన శనగలు తీసుకోండి. తీపి తినాలనిపిస్తే చాక్లెట్లకు బదులుగా పండ్లు లేదా ఖర్జూరాలను ఎంచుకోండి. ఇలా చేయడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. వంటగదిలో లేదా ఆఫీసు డెస్క్‌లో జంక్ ఫుడ్ నిల్వ ఉంచకండి. బయటకు వెళ్ళేటప్పుడు ఇంట్లోనే ఏదైనా తిని వెళ్లడం వల్ల బయటి తిండిపై ఆశ కలగదు. షాపింగ్ చేసేటప్పుడు ముందే లిస్ట్ రాసుకుని వెళ్లడం వల్ల అనవసరమైన చిరుతిళ్లు కొనకుండా ఉండవచ్చు.

# రోగనిరోధకత పెంచడంలో దీనికి సాటి లేదు



గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా విస్తారంగా జీడి తోటలు కనిపిస్తుంటాయి. అయితే మన కళ్లు ఎప్పుడూ ఆ చెట్టు చివరన వేలాడే జీడి గింజల (జీడిపప్పు) మీదే ఉంటాయి. కానీ ఆ గింజకు ఆధారమైన రంగురంగుల జీడి పండును మాత్రం మనం పెద్దగా పట్టించుకోము. తోటల్లో రాలిపోయి, నేలపాలయ్యే ఆ పండులో ఎన్ని అద్భుత ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. కేవలం గింజ కోసం పండును పారేయడం ఎంత పెద్ద పొరపాటో తెలుసా? ఆ చెట్టు ఇచ్చే గింజను మనం వేల రూపాయలు పోసి కొంటాం. కానీ అదే చెట్టు ఇచ్చే పండును మాత్రం కనీసం ఉచితంగా ఇచ్చినా తీసుకోము. పల్లెటూళ్లలో వేల టన్నుల కొద్దీ ఈ పండ్లు నేల రాలి కుళ్లిపోతుంటాయి. తీపి, వగరు కలగలిసిన రుచితో ఉండే ఈ పండును కేవలం ఒక వ్యర్థంలా చూడటం మన అవగాహన లోపమే. నిజానికి పోషకాహార నిపుణులు దీనిని ఒక 'సూపర్ ఫుడ్'గా అభివర్ణిస్తున్నారు. మన శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాల గనిగా పిలిచే పండే జీడి మామిడి పండు. జీడి పండులో విటమిన్ సి అపారంగా ఉంటుంది. నిమ్మ, నారింజ వంటి పండ్ల కంటే కూడా ఇందులో విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఈ పండును తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారి నుండి తప్పించుకోవచ్చు. నేటి కాలంలో మహిళలు, గర్భిణీలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్య రక్తహీనత. జీడి పండులో ఐరన్, కాపర్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది. సహజ సిద్ధంగా రక్తాన్ని వృద్ధి చేసే గుణం ఈ పండుకు ఉంది. రోజూ ఈ పండును ఆహారంలో భాగంగా తీసుకుంటే రక్తహీనత సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది. జీడి మామిడిలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది పొట్ట పనితీరును మెరుగుపరిచి మలబద్ధకం, గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన స్నాక్. ఇది తిన్న వెంటనే కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది, తద్వారా అనవసరమైన చిరుతిళ్లపై ఆశ కలగదు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. ముఖంపై ముడతలు, గీతలు రాకుండా నివారిస్తాయి. అలాగే ఇందులోని పొటాషియం రక్తపోటును నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీడి పండు కొంచెం కషాయం లేదా వగరు రుచిగా అనిపించవచ్చు. కానీ దీనిని శుభ్రంగా కడిగి తీసుకోవడం వల్ల మన శరీరానికి అందే పోషకాలు అమూల్యం. కేవలం జీడిపప్పు కోసమే కాకుండా, ఆరోగ్యం కోసం ఈ అద్భుతమైన పండును కూడా ఆదరించండి. ప్రకృతి ఇచ్చిన ఈ సహజ ఔషధాన్ని ఇకపై నేలపాలు చేయకండి!

# ఆరోగ్యానికి మంచిదే కదా అని తినేస్తున్నారా.!



టమాటాలు నిత్యవసరమైనప్పటికీ, వాటి తొక్కపై పురుగుమందుల అవశేషాలు చేరే ప్రమాదం ఉంది. కేవలం నీటితో కడగడం సరిపోదు. ఉప్పునీటిలో 15-20 నిమిషాలు నానబెట్టి, బాగా రుద్దడం ద్వారా పురుగుల మందుల అవశేషాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు ప్రతి వంటింట్లోనూ టమాటాలను నిత్యం వాడతారు. అయితే, ఇటీవలి కాలంలో వ్యవసాయంలో పురుగుమందుల వాడకం పెరగడంతో, తొక్కతో తినే టమాటాలను సరిగ్గా శుభ్రం చేయడం అత్యవసరం. కేవలం నీటితో కడగడం వల్ల టమాటా తొక్కపై అంటుకున్న పురుగుమందుల అవశేషాలు పూర్తిగా తొలగిపోవు. టమాటా తొక్క సన్నగా, సున్నితంగా ఉండటం వల్ల రసాయనాలు సులభంగా అంటుకుంటాయి. ఈ రసాయన అవశేషాలను తగ్గించడానికి ఒక పద్ధతి ఉప్పునీటితో శుభ్రం చేయడం. టమాటాలను ఉప్పునీటిలో దాదాపు 15 నుండి 20 నిమిషాలు నానబెట్టాలి. ఉప్పులోని సహజ శుభ్రపరిచే లక్షణాలు పురుగుమందులను వదిలిస్తాయి. అనంతరం, శుభ్రమైన నీటితో కడిగి, చేతులతో సున్నితంగా రుద్దడం వల్ల మట్టి, దుమ్ము, బ్యాక్టీరియా తొలగిపోతాయి. టమాటాలను నిల్వ చేసిన తర్వాత లేదా ఉపయోగించే ముందు తప్పనిసరిగా కడగాలి. అయితే, వండడానికి ముందు టమాటాలను ఎక్కువసేపు నీటిలో నానబెట్టకూడదు, ఎందుకంటే ఇది వాటి ఆకృతిని ప్రభావితం చేయవచ్చు. టమాటాల్లో దెబ్బతిన్న భాగాలను ముందుగానే తొలగించడం మంచిది. ఒకవేళ మీరు పురుగుమందుల అవశేషాల గురించి మరింత ఆందోళన చెందుతుంటే, టమాటా తొక్క తీసి కూడా ఉపయోగించవచ్చు.

ఇది చర్మం నుండి ఉపరితల పురుగుమందుల అవశేషాలను చాలా వరకు తొలగించడానికి సహాయపడుతుంది. స్థానికంగా పండించిన టమాటాలు కొనుగోలు చేయడం ద్వారా పురుగుమందులకు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు. ఉప్పునీటి పద్ధతి ఉపరితల పురుగుమందులను మాత్రమే తగ్గిస్తుందని గుర్తుంచుకోవాలి. టమాటాలను పండించే సమయంలో వాటిలోకి చొప్పించిన (సిస్టమిక్) రసాయనాలను ఈ పద్ధతి పూర్తిగా తొలగించదు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా, వంటింట్లో ఇలాంటి చిన్న చిన్న శుభ్రపరిచే చర్యలు మీ కుటుంబ ఆరోగ్యంపై పెద్ద ప్రయోజనాలను కలిగిస్తాయి. టమాటా తొక్కలను ఉప్పుతో సరిగ్గా శుభ్రం చేయడం పురుగుమందుల అవశేషాలను తగ్గించడానికి ఒక సులభమైన, ప్రభావవంతమైన పద్ధతి.

# ఐసీసీ ట్రోఫీ గెలవాలి.. పాకిస్థాన్‌పై తీవ్ర ఒత్తిడి: ఫఖర్ జమాన్ సంచలన వ్యాఖ్యలు



దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న 2027 వన్డే ప్రపంచ కప్ కు ముందు పాకిస్థాన్ క్రికెట్ జట్టులో అంతర్గత మథనం మొదలైంది. ఇటీవల కాలంలో వరుస అంతర్జాతీయ పరాజయాలతో పాటు ఇంగ్లాండ్ పర్యటనలో క్లీన్ స్వీప్ ఎదుర్కొన్న పాక్ జట్టుపై అభిమానుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీలంక, ఇంగ్లాండ్‌లతో రవల్పిండి వేదికగా ఈరోజు (2026, అక్టోబర్ 18, ఆదివారం) ప్రారంభమయ్యే ముక్కోణపు వన్డే సిరీస్ ( తొలి మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ డాషింగ్ ఓపెనర్ ఫఖర్ జమాన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**2017 నుంచి ఐసీసీ ట్రోఫీ లేక తీవ్ర ఒత్తిడిలో ఉన్నాం:**

పాకిస్థాన్ జట్టు 2017 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఇప్పటి వరకు ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవకపోవడంపై ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఫఖర్ జమాన్ తెలిపాడు.

తీవ్ర నిరాశలో అభిమానులు: సుదీర్ఘకాలంగా మేము ఐసీసీ టైటిల్ సాధించకపోవడంతో దేశ ప్రజలు, అభిమానులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలుసు.జ మేము బాగా ఆడినప్పుడు ఎంత ప్రేమాభిమానాలు చూపిస్తారో, విఫలమైనప్పుడు అంతే అసంతృప్తి చెందుతారు.. ఈ ట్రోఫీ కరువుకు ముగింపు పలకడంపై జట్టులో నిరంతరం విస్తృత చర్చలు జరుగుతున్నాయని ఫఖర్ వ్యాఖ్యానించాడు.

**2027 ప్రపంచ కప్ గెలవడానికి ఫఖర్ ప్లాన్ ఇదిగో:**

రాబోయే వన్డే ప్రపంచ కప్ కోసం ఇప్పటి నుంచే సరైన తుది జట్టు కలయికను రూపొందించుకోవడం అత్యంత కీలకమని ఫఖర్ జమాన్ తెలిపాడు.

ఫస్ట్ క్లాస్ క్రికెట్ ప్రాధాన్యత: టీ20ల నుంచి నేరుగా వన్డే ఫార్మాట్‌కు మారడం చాలా కష్టమని, కానీ ఫస్ట్-క్లాస్ (రెడ్ బాల్) క్రీడలు ఆడి వన్డేల్లోకి రావడం వల్ల ఆటగాళ్లకు శారీరకంగా, మానసికంగా ఎంతో ఉపయోగపడుతుందని చెప్పాడు. ప్రస్తుత పాకిస్థాన్ ఆటగాళ్లంతా స్వదేశీ ఫస్ట్-క్లాస్ సీజన్ ఆడి మంచి ఫామ్‌తో ఈ ట్రై-సిరీస్‌లోకి అడుగుపెడుతున్నారని, ఇది 2027 వరల్డ్ కప్ వేటకు మంచి పునాది అని విశ్వాసం వ్యక్తం చేశాడు.

# వైభవ్ చానా మంచి ఆటగాడు.. కాస్త ఓపికతో ఉంటే ఛాన్స్‌లు వస్తాయి: శ్రేయస్ అయ్యర్



భారత టీ20 జట్టులో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ని వరుసగా బెంచ్ మీదనే కుర్చొబెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ వైభవ్‌కు తుది జట్టు లో ఆడే అవకాశం దక్కలేదు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన సూర్యవంశీ, స్వదేశంలో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. ఐర్లాండ్, అఫ్ఘనిస్థాన్, జపాన్, వెస్టిండీస్ సిరీస్‌లలో అతను బెంచ్ కే పరిమితమయ్యాడు.

**ఓపికతో వేచి చూడాల్సిందే: శ్రేయస్**

వెస్టిండీస్ సిరీస్ ముగిసిన అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. వైభవ్‌కు నేను ఎప్పుడూ చెబుతుంటాను.. నీకు అవకాశాలు తప్పకుండా వస్తాయి, నీ ప్రాసెస్, మైండ్‌సెట్‌ను సరిగ్గా ఉంచుకుని అవకాశాల గురించి ఎక్కువ ఆలోచించకూడదు.. కొన్నిసార్లు వేచి చూడక తప్పదు.. ప్రస్తుతం జట్టులో ఓపెనర్లుగా ఉన్న ఇద్దరు (అభిషేక్ శర్మ, సంజు శాంసన్) నిలకడగా రాణిస్తున్నారని శ్రేయస్ చెప్పుకొచ్చాడు.

**టీమిండియాపై కోచ్ మనీష్ ఓఝా ఫైర్:**

సూర్యవంశీకి అవకాశం ఇవ్వకపోవడంపై అతని చిన్ననాటి కోచ్ మనీష్ ఓఝా తీవ్రంగా మండిపడ్డాడు. ఈ చిన్న వయసులో ప్రతి మ్యాచ్ ఆడటం ద్వారానే ఆటగాడు మానసికంగా దృఢంగా మారతాడు, అతని గేమ్‌లో మెరుగులు దిద్దుకుంటాయి. కానీ అతను బయట కూర్చొని వాటర్ సీసాలు అందిస్తున్నాడు.. ప్రస్తుతం ఉన్న మేనేజ్‌మెంట్ నియంతృత్వంద ప్రదర్శిస్తోందని ఆరోపించాడు.

**నెక్స్ట్ టార్గెట్ న్యూజిలాండ్ సిరీస్:**

ఏషియన్ గేమ్స్ 2026లో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులో భాగమైన సూర్యవంశీ, త్వరలోనే ప్రారంభం కానున్న న్యూజిలాండ్ ౨20 సిరీస్ కోసం పయనం కానున్నాడు. ఈ టూర్‌లోనైనా ఈ యంగ్ లెఫ్ట్ హ్యాండర్‌కు తుది జట్టులో అవకాశం దక్కుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# ఒక్క పరుగుకే గిల్ ను వెనక్కిపంపిన ఛత్తీస్‌గఢ్ బౌలర్..



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రంజీ ట్రోఫీ రీఎంట్రీ కలిసిరాలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతను, ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. పంజాబ్ తరఫున ఆడుతున్న గిల్, కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఛత్తీస్‌గఢ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ అద్భుతమైన బంతితో అతడిని క్లీన్ బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.మొహాలీలోని కొత్త పీసీఏ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టులో గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇన్నింగ్స్ 27వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన అజయ్ మండల్.. తన మూడో బంతికే గిల్‌ను బోల్తా కొట్టించాడు. బంతి లైన్ ను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైన గిల్, దాన్ని అడ్డుకోలేకపోయాడు. బంతి నేరుగా బ్యాట్, ప్యాడ్ మధ్యలో నుంచి దూసుకెళ్లి మిడిల్ స్టంప్‌ను గిరాటేసింది. దీంతో కేవలం 5 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగుకే గిల్ తన ఇన్నింగ్స్‌ను ముగించాడు.భారత జట్టు త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. ఈ కీలక పర్యటనకు ముందు రెడ్ బాల్ క్రికెట్‌లో తగినంత ప్రాక్టీస్ పొందాలనే ఉద్దేశంతోనే గిల్ ఈ రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. సీజన్‌లోని తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్న అతను, ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాడు. కానీ, ఊహించని విధంగా విఫలం కావడం అభిమానులను నిరాశపరిచింది.న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) ఫైనల్ రేసులో నిలవడానికి ఈ సిరీస్ భారత్‌కు చాలా కీలకం. అయితే, గిల్ తొలి మూడు వన్డేల్లో మాత్రమే ఆడి, టెస్ట్ సిరీస్‌కు సంసిద్ధం కావడానికి చివరి రెండు వన్డేలకు దూరం కానున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బెంగాల్ తరఫున సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో సోదరుడు మహమ్మద్ కైఫ్ జట్టులోకి వచ్చాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోయిన షమీ, న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయితే, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం అతను నిలకడగా రాణిస్తున్నాడు.

# ఆరెంజ్ మూవీలోని ఒక్క సీన్ తీసుకొని సినిమా చేసిన యంగ్ డైరెక్టర్...సూపర్ హిట్ అయిందిగా..



పాలక్ తివారీ పర్పుల్ డే లుక్ అందరినీ ఆకట్టుకుంది

తెలుగు సినిమా ఇండస్ట్రీ సక్సెస్ ఫుల్ గా ముందుకు దూసుకెళ్తుంది. ప్రస్తుతం ఇండియా వైడ్ గా మన హీరోలకు ఉన్న క్రేజ్ నెక్స్ట్ లెవెల్ అనే చెప్పాలి. రామ్ చరణ్ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆరెంజ్' సినిమా ఆశించిన మేరకు విజయాన్ని సాధించలేదు. మగధీర తర్వాత వచ్చిన సినిమా కాబట్టి ఈ మూవీ మీద భారీ హైప్ ఉండటంతో ఈ మూవీ ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. మొత్తానికైతే ఈ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో బొమ్మరిల్లు భాస్కర్ మీద తీవ్రమైన విమర్శలైతే వచ్చాయి. అప్పట్లో ఈ సినిమా ఫ్లాప్ అయినప్పటికి ఇప్పుడు మాత్రం కల్ట్ క్లాసిక్ సినిమాగా చెబుతున్నారు. రీ రిలీజ్ చేసినప్పుడు ఈ సినిమాని చూడడానికి యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులంతా ఇంట్రెస్ట్ చూపించారు. మొదట మూవీ రిలీజ్ అయినప్పుడు ఆ టైమ్ లో ఉన్న ప్రేక్షకుల మైండ్సెట్ కి రీచ్ అవ్వలేదు. కానీ ఇప్పుడున్న జనరేషన్ కి ఈ సినిమా పర్ఫెక్ట్ గా మ్యాచ్ అయింది అంటూ చాలామంది సినీ విమర్శకులు సైతం కామెంట్లు చేయడం విశేషం...

**ఒక్క సీన్ తో సినిమానే వచ్చిందా**

ఆరెంజ్ సినిమాలో ఫోన్స్ ఎక్స్ఛేంజ్ చేసుకోవడం మీద ఒక సీన్ ఉంటుంది. అప్పట్లో ఫోన్ యూజ్ ఎక్కువగా లేదు. కాబట్టి ఆ ఫోన్ ఇచ్చే సీన్ పెద్దగా ఎఫెక్టివ్ గా అనిపించలేదు. కానీ ఇప్పుడున్న జనాలు ఫోన్ కి ఎక్కువగా అడిక్ట్ అయిపోయారు. ఒకరి ఫోన్లో ఎన్నో సీక్రెట్ లు ఉంటాయి. ఫోన్స్ ఇవ్వడానికి ఎవ్వరు ఇష్టపడరు. అదే పాయింట్ మీద యంగ్ డైరెక్టర్ అయిన ప్రదీప్ రంగనాథన్ 'లవ్ టుడే' సినిమా చేశాడు. ఈ సినిమా సూపర్ సక్సెస్ అయింది. ఆ థాట్ ఈ జనరేషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే విధంగా ఉండడంతో సినిమా సూపర్ సక్సెస్ అయింది.

ఆరెంజ్ సినిమా అప్పుడు ఆడక పోవడానికి కారణం అప్పుడు ఫోన్లు వాడే వాళ్ళ సంఖ్య తక్కువగా ఉంది. అలాగే ఆ సన్నివేశం ప్రేక్షకులకు పెద్దగా



ఎఫెక్టివ్ గా అనిపించలేదు. ఒక సినిమా సక్సెస్ అవ్వాలంటే అప్పుడు ఉన్న పరిస్థితులను బట్టి అప్పుడున్న ప్రేక్షకుల మెంటాలిటీని బేస్ చేసుకొని అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా సినిమాని తెరకెక్కించాలి. అడ్వాన్స్డ్ ఆలోచనలతో సినిమాని తీస్తే కొన్ని సందర్భాల్లో సక్సెస్ ని సాధించవచ్చు కానీ అప్పుడున్న ప్రేక్షకుల మైండ్ సెట్ ప్రకారం ఆ సినిమా ఎక్కువ మందికి రీచ్ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి...



ప్రకృతి పావని షీర్ మెటాలిక్ గ్రే ఎన్‌సెంబుల్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965